సిరిగీతిక

(సమకాలీన సామాజిక సమస్యలు - పరిష్కారాలు)

ఖండకావ్యము

కావ్యకళాప్రపూర్ణ, సహజకవితా కళాభిజ్ఞ

డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

అంకితం

జననీ జనకులు : **శ్రీ లక్ష్మీ నరసింహ శాస్త్రి, కామేశ్వరి గారలకు**

ఉ. ఏ నొనగూర్చుకొన్న మహనీయపురాకృతపుణ్యమేమొ ల
క్ష్మీ నరసింహ శాస్త్రి వరసిద్ధకవీంద్రునకున్ సుతుండనై
ధీనయగారముల్ దెలిసి తృప్తిగ నీ సిరిగీతికావళిన్
జ్ఞానగుణాది సంపదల శబ్దవిధంబుల పల్కరించితిన్.

ఉ. ఈశ్వరుడే కవిత్వమొక యించుక వ్రాసెడి శక్తిమత్వమున్
శశ్వదనంత శబ్దమయ సంపద నాకు లభింప జేయ కా
మేశ్వరి తల్లియై వర సమృద్ధ సుధారసధార లెల్లెడన్
శాశ్వతమై స్రవింప నను సత్కృపతో గనె నాంధ్రి సేవకున్.

డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

సిరిగీతిక

(సమకాలీన సామాజిక సమస్యలు – పరిష్కారాలు)

ఖండకావ్యము

కావ్యకళాప్రవీణ, సహజ కవితా కళాభిజ్ఞ

డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

సిరిగీతిక

(సమకాలీన సామాజిక సమస్యలు – పరిష్కారాలు)

ఖండకావ్యము

డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ

© సర్వహక్కులు గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణ : జనవరి 2024
ప్రతులు : 100
వెల : ₹ 60

ప్రతులకు...
డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ
23/175–A, రామనాయుడుపేట,
మచిలీపట్నం – 521001
(చరవాణి : +91 6303885869)

డి.టి.పి : కంది శంకరయ్య, వరంగల్
కవర్ డిజైన్ : విట్టుబాబు, హైదరాబాదు
ముద్రణ : ముద్రికా ప్రింటర్స్, విజయవాడ

ముున్నుడి

సిరిగీతిక ఉత్తర అమెరికా తెలుగు సంఘం (TANA) వారి పిలుపు మేరకు వారిచ్చిన అంశాలలో సామాజిక సమస్యలు - పరిష్కారమార్గాలు అనే అంశం తీసుకుని వ్రాయబడిన పద్యకావ్యం. వారేదో బహుమతిని ప్రకటించారు కానీ దానిని ఆశించక, ఆ రూపంగా నేను మరొక కావ్యాన్ని సామాజికపరంగా నా అభిప్రాయాలతో వ్రాసే సందర్భం కలిగిందని భావించి వ్రాశాను. తరువాత తెలిసింది – తానా వారు ఈ పుస్తకాన్ని e-book ముద్రణకు ఎంపిక చేశారని. కానీ దాన్ని నేను చూడలేదు. ఒక మిత్రుడు అది తనకు పంపారని చెప్పారు. అయినా నా కావ్యాల వరుసలో దీన్ని చేర్చుకోవాలని ఆశించాను. నిన్ననే శ్రీ తోపెల్ల బాల సుబ్రహ్మణ్యం గారు పరిచయం అయ్యారు. రచయితల పాలిట శ్రీ కంది శంకరయ్య గారు కల్పతరువు అని చెప్పారు. వారిని పరిచయం చేసుకుని సిరిగీతికను ఎలా వెలుగులోకి తేవాలి అని అడిగాను. మరునాటికే వారు గొప్ప సాంకేతిక నైపుణ్యంతో దీనికి ఒక ఆకృతినిచ్చి ముద్రణకు సిద్ధం చేసి నాకు పంపారు. ఇదంతా నాకు ఒక కలగా జరిగిపోయింది. నేను ఇరవైమంది కావ్యకన్యకల జనకుణ్ణి. అయిదుగురిని బయటకు పంపాను. మిగిలినవాళ్ళని ఎలాగా అనుకుంటున్న తరుణంలో శ్రీ శంకరుల వారు నాకు ప్రోత్సాహాన్నిచ్చారు. శ్రీ కంది శంకరయ్య గారికీ, శ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యం గారికీ నా కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను. అలాగే ఈ కావ్య ముద్రణాధిపతులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

మచిలీపట్నం, భవదీయుడు,

23-జనవరి, 2024. **డా. చింతలపాటి మోహన మురళీకృష్ణ**

Ph.D.,

ఇందులో .....

1. అవినీతి 5

2. కులతత్వం 10

3. నైతికవిలువలు 15

4. మాదకద్రవ్యాలు 20

5. తీవ్రవాదం 25

6. ధర్మహాని 31

7. మతవైషమ్యాలు 36

8. కుటుంబ సంబంధాలు 41

9. నిరుద్యోగ సమస్య 46

10. అధికజనాభా 51

1. అవినీతి

ఉ. చిల్లరకొట్టు రోజులవి చెల్లెను లక్షలు పోయి కోట్లకై
తల్లడమొందుచున్ ప్రభులు తాము మహాత్ములమంచు నిక్కుచున్
కల్లలవన్ని సత్యమని గాథలు చెప్పుచు దేశవాసులన్
కొల్లగ దోచుచుండిరిది గూఢనివేదిక దాచుకొమ్మురా! 1

ఉ. తిండికిలేని బక్కడు యథేచ్ఛగ కాసుకు నాశజెందుచో
చెండుచునుండిరే దొరలు చేతులు చాచక దోచుచుండినన్
పండుగ జేసికొంచు నభివాదములిచ్చుచు కాళ్ళు దాకగా
దండిగ మెచ్చుకొందురిది ధర్మవిలాసము దాచుకొమ్మురా! 2

ఉ. ఎన్నికలందు వోటు గొన నెంతయు సొమ్ము నొసంగి మీదటన్
వన్నెలు మార్చు జంతువుల వైఖరి బోలుచు కిక్కురన్నచో
తిన్నగ బొక్కలో తురిమి తీంద్ర వదిల్చెడి తీరు జూడగా
అన్నల నీతి యెంత ఘనమైనదొ చెప్పక దాచుకొమ్మురా! 3

ఉ. దేశమునమ్మివైచి పరితృప్తిగ సొమ్మును దాచివైచి సం
దేశముగా దరిద్రమను తీరును నల్వురిలోన చాటి యీ
దేశమునుద్ధరింపగల ధీరుడనేనని నన్నొకండనే
దేశమునేలనిమ్మనెడి దేవుని గాథలు దాచుకొమ్మురా! 4

శా. స్వాతంత్ర్యమ్మును కోరి యాస్తులను నిస్స్వార్థమ్ముగా నుద్యమ
శ్రీతాత్పర్యముతో నొసంగిరి ఘనుల్ చింతింపగా నాడు! కా
నీ తద్భావన నేడు లేదు; నిధులన్నీ తాము భక్షింపగా
ప్రీతిన్ జిత్తులు పన్నుచుండిరిది నీవే దాచుకో సోదరా! 5

ఉ. పాలన చేతకాక బలవంతపు పన్నులు మీద రుద్దుచున్
గోల యొనర్చువారల నకుంఠిత రీతి నణంచివేయుచున్
వ్రాలిన భక్తి మ్రొక్కులిడువారల నున్నతపీఠి నుంచుచున్
మేలగు పాలనంబనుచు మేదిని చాటుట దాచుకొమ్మురా! 6

ఉ. చేనుకు కంచె కాపను ప్రసిద్ధి తొలంగెను; నేడు కంచెయే
చేనును మేయునన్నది విశిష్టత నొందెను; చేను నియ్యెడన్
మానుగ కాచు నెవ్వ డనుమానములేదిట కాపు లేడు; భూ
జానికి సొమ్ము వచ్చినను చాలు! దరిద్రము దాచుకొమ్మురా! 7

ఉ. కూరలు వంటనూనెలవి ఘోరము మందులు తిండిగింజలున్
కూరిమితోడ కల్తియయి గూఢముగా నసువుల్ దొలంచుచున్
పారము జూపుచుండినవి; భద్రత యన్నది యెందు బోయె నిం
పారగ సొమ్ము జేసుకొను పద్ధతి! చెప్పకు! దాచుకొమ్మురా! 8

ఉ. తూకములందు లొల్లి; పలు దోషము లెల్లెడ పొంగిపొర్లి యు
ద్రేకము కల్గజేయు నిది దేశమునందున మానితంబయెన్
లోకవిశిష్టమై జనులలో నలవాటుగ మారిపోయె నీ
లౌకికధూర్తవర్తనము! లక్ష్యమిదే మది దాచుకొమ్మురా! 9

శా. జీయెస్టీ యనుపేర లాగికొనుచున్ "చింతింపగా రాదురా!
నీయాస్తుల్ బహుభద్రమౌ కరణి వాణిజ్యంబె! యిందెంత య
న్యాయంబేమియులే" దటంచు ప్రభువుల్ నానావిధవ్యాఖ్యలన్
శ్రేయంబుల్ వచియించు రీతి గని భాషింపంగ రాదింతయున్. 10

శా. ఉద్యోగుల్ చరియించు పద్ధతులు విద్యుద్ఘాతచందంబునై
యాద్యంతంబులు లేక సాగునవి జీవావిష్కృతిన్ దుల్చి సం
విద్యోగంబున పోవు త్రోవ గనగా విచ్ఛిత్తి చేకూర్చి భా
వోద్యోగంబున సాగురీతి మదిలో నూహింపుమా యియ్యెడన్.11

శా. వ్యాపారంబున మోసమింత యయినన్ వర్తిల్లబోదంచు గం
గా పాతంబుగ సాగు నీ ప్రకటనల్ కాలానుకూలంబులై
తాపంబున్ పరిమార్చు; నిందు నిజతత్వంబింతయున్ లేదు గా
నీ పేరాసకు లోనుజేయు విధమిందే నీవు గుర్తింపుమా! 12

ఉ. వైద్యమనంగ లాభము నవారితరీతి నొసంగునట్టి సం
పద్య విశేష వర్తకము; ప్రాణము పోవుచునున్న పైకమున్
హృద్యముగా నొసంగిననె నింత చికిత్స యొనర్తు; లేనిచో
వైద్యులు లేరు పొమ్మనుచు వందనమిత్తురు దాచుకొమ్మురా! 13

ఉ. మందు ఖరీదు పెంచి బహుమానముగా నిసుమంత ద్రుంచి కొ
మ్మందురు; దీని లాభమున హాయిగ సౌధములన్ రచించి పై
నుందురు; కాసులేని ప్రజనొక్కని వీరలు కావ జాల రే
మందుము వీరి వైఖరిని నల్లరిసేయక దాచుకొమ్మురా! 14

ఉ. లంచము లేనిచో పని విలంబనమౌనను మాట యెన్నడో
కొంచెము విందు మయ్యది యకుంఠిత దీక్షను సాగుచుండి లా
లించుచునుండె సంఘమును లీలగ! దీనిని బాపువారలే
యించుక శ్రద్ధ జూపక సహించుట నింద్యము; దాచుకొమ్మురా! 15

చం. ఎరుగనివారి నెన్నుకొని యేడ్చుటకంటెను ముందు వారలన్
సరియగువారొ కారొ యని చక్కగ మున్ వెనుకల్ విచారమిం
పరయగ జూచి యెన్నుకొని హాయి గడించిన సేమమౌనుగా
యరయక రొక్కమున్ మదిర లాభమటన్నను మీదనిట్టులౌ! 16

ఉ. ఓటుకునోటునిచ్చు; నధికోద్ధృతి పోయును మందటంచు నీ
యోటును జారవైచునెడ నుస్సురటంచును నేడ్వగావలెన్
చేటు గ్రహింపలేక ధనసిద్ధికి చేతిని చాచినంతనే
యోటమినొందినట్లు మది నూహచెలంగిన మేలు కల్గెడిన్. 17

మ. అధికారమ్మును కట్టబెట్టి తుదకున్ హాహాకృతుల్ సేయగా
బధిరాకారులు గాక యేలికలు నీ బాధన్ విలోకింతురో
బుధుడేనాడును బుద్ధిహీనుడగునే పుణ్యాత్ముడెవ్వండు మం
దు ధనాసక్తుల బూని యోటునిడునే దోషంబులన్ జేయునే? 18

మ. తలిదండ్రుల్ గురువుల్ సమర్థులగుచున్ తాత్పర్యభావంబుతో
కలవృత్తంబులనెల్ల బాలకులకున్ గాథానురూపాంబుగా
తలలో నాటుచు నీతివంతులుగ సంధానించి రూపించుచో
పొలుపొందున్ గద జాతిభవ్యమది యుద్బోధించు పుణ్యమ్మునన్. 19

ఉ. పాలనగూర్చినేర్చుకొని బాధ్యతనింత నెరుంగువారలన్
మేలనియెన్నుకోవలయు; మిత్రుడటంచు కులమ్మువాడనన్
తూలి భుజాలకెత్తుకొని దోషమొనర్చిన భంగపాటగున్
కాలప్రభావమున్ దెలిసి ఖచ్చితరీతిని వోటువేయుమా. 20

చం. యువకులు బాధ్యులై పలుకు యుక్తులు పన్నెడి వారి లీలలన్
వివరములన్ గ్రహించుచు వివేకముతోనది యెల్లవారికిన్
శ్రవణసుఖంబుగా వినిచి సంగతి నేర్పిన దుష్టబుద్ధులున్
జవము నశించి నక్కెదరు జాతిని తాకక యుద్యమించినన్. 21

చం. ప్రజలకు చేతనత్వమది వచ్చిన చేటు రహింపబోదు; దు
ర్వ్యజనము సాగబోదు; ప్రతివాడును నీతిని గల్గి యుండినన్
కుజనుల యాట సాగదు; నిగూఢపు దోపిడి యాగిపోవు; నీ
యజనము కుట్టకారు శిరమందున దాల్చి చరింపగావలెన్. 22

ఉ. లంచము గోరు మూర్ఖుని బలంబును ద్రెంచిన జీవితమ్ములో
లంచము కోరబోడు; పనులన్నియు వెంటనె నిర్వహించి యే
కొంచెము లోపముండినను కూరిమితో సవరించి కార్యముల్
వంచనలేక చేయగల వైఖరి నూనును పూన్కి యుండినన్. 23

ఉ. పీడకుడైన వైద్యుని యభీష్టములన్నియు నిల్పివైచి యే
నాడును రోగులన్ కసరు నైజము వీడెడునట్లు సేయ నె
వ్వాడును పూనుకోవలయు; వానికి లోకులతోడి బంధముల్
వీడనియట్లు సేయవలె; వేదన వానికి కల్గగావలెన్! 24

౨. కులతత్వం

ఉ. వృత్తిని బట్టి యేర్పడిన భిన్నకులమ్ములు నేడు ఛిన్నమై
సత్తువ గల్గు వర్గముల చాడ్పున మార్పులు పొంది భేద ము
వ్వెత్తున రేగునట్లు కలహించుచునుండగ రాజకీయు లు
న్మత్తత లబ్ధినొందగల మార్గమునెంచుట నీచతత్వమౌ! 1

మ. కులతత్వంబది కూడువెట్టునొకొ! యీ కూటంబు లేరీతిగా
నిలలో సర్వజనాళి మేలు గనునో! యే కొందరి క్షేమమో
పలు వర్గంబులవారి సేమమగునో! భావింప వేర్పాటులే
తలపోయన్ సువిశాలదేశభవితాదర్శంబు రూపించునో! 2

చం. కులమది యున్న మాత్రమున కొంపలు కూలవు; కాని నీకులం
బలతుల కన్న గొప్పదనునట్టి యహంకృతి కీడు సేయు; కొం
దలపడజేయు భావములు తక్కిన వారిని రెచ్చగొట్టు; గో
తులు సృజియించి యన్యకులదూషణకున్ పురికొల్పి కూల్చెడిన్. 3

చం. జనులు సమైక్యభావమున సాగిన మేలగు గాని వర్గ భే
దనమున చీలిపోయి కులదర్పము జూపిన దేశమేమగున్?
దినదిన ఘర్షణాకులిత దీనచరిత్రఫలమ్మునొంది మే
దిని బలహీనజాతి యని దృష్టి గడించి వినాశమొందెడిన్. 4

చం. కులములవెన్ని యుండినను కూరిమితోడ చరింప గల్గుచో
బలిమిని పొంది విశ్వమున భద్రతతోడ పురోగమించుచున్
కలిమి గడింపగాగలము గాని కులమ్ముల పేర చీలి దీ
నుల గతి పోరుచుండిన వినోదము కల్గును వేరువారికిన్! 5

ఉ. పుట్టుకతో కులమ్మెవడు మోసుకురాడు; జనించు మీదటన్
పెట్టిన వర్గభేదమిది! పేర్కొన జాలును గాని దీనిచే
కొట్టుకు చావనేల? బలుగోల యొనర్పగనేల? పోరగా
పట్టుదలన్ వహించుట శుభంబది కాదని లో నెరుంగరా! 6

మ. కులసంఘమ్ములు మేలు సేయక మహాక్రోశంబు గల్పించి నా
కులపాటున్ జనులందు గూర్చిన మహాక్షోభంబు వాటిల్లు; దీ
నుల గాపాడెడి వృత్తి బూని జనులెంతో వృద్ధినొందంగ దృ
క్కుల సారించిన మేలుగూరునట! సంకోచమ్ము లేదింతటన్. 7

చం. కులమున నైకమత్యమది కూరిమి గల్గగ జేయు నిట్టిదే
బలమని నమ్మి వేరు కులవర్గము వారలతోడ కూడినన్
ఫలితము గొప్పదై జనుల భాగ్యవిశేషము వృద్ధిసేయు; నిం
దులకయి దీక్షబూనుచు జనుల్ కదలాడిన మేలుకల్గురా! 8

ఉత్సాహ.
రాజకీయలబ్ధి కోరి రచ్చచేయు మూకకున్
తేజమడరి తొత్తులగుచు తీంద్రతో చరించుచున్
నైజమైన కాంతివీడి నాశమొందు రీతులన్
భూజనుల్ భరింపలేరు బుద్ధి జెప్ప జూచెడిన్. 9

మ. పదవిన్ గైకొనినంతనే తన కులత్వంబున్ నిరూపించి నె
మ్మది నుద్యోగములన్ సవర్ణులను సమ్మానించి చేర్పించి సం
పద వర్షింపగ జేయు సంగతులు సంభావింప ద్రోహంబుగా
మదిలో నిల్చును; వేరువారినిదియే మళ్ళించు నా వంకకున్. 10

చం. మనకులమైన కన్గొనుము; మన్నన సేయుము; కాకపోవుచో
కనుగొనబోకుడీ మనల కార్యము వీరు సహింపరన్న యా
జ్ఞను కులపెద్దలిచ్చెడి యసమ్మతి వైఖరి తోటివారికిన్
మనసు కలంచి ఘర్షణ ప్రమాదము నిచ్చును దీని బాపుడీ! 11

మ. ప్రభువర్గంబులుగూడ కూటనియతిన్ వైషమ్యముల్ పెంచుచున్
శుభసంస్కారము లేక పేదకులముల్ శోభావహంబౌనటుల్
అభివృద్ధిన్ గనురీతి సల్పక మహోహైన్యంబుగా దీనులన్
విభవంబెల్ల తొలంగు రీతి నణచన్ భీతిల్లు నవ్వారలున్. 12

మ. కులవర్గీకరణంబు జేసి జనులన్ కూటాలుగా చెప్పి వీ
రల వృద్ధిన్ గమనింపగావలయునన్ రాజ్యాంగచట్టంబు పే
దలపాలిన్ వరమిచ్చుచుండ దొరలున్ తత్సారమున్ వోట్లకై
బలమైనట్టి పథంబుగా గనుట సంభావ్యమ్ము కాదింతయున్. 13

ఉత్సాహ.
రాజకీయ కూటములకు రక్ష వర్గభేదముల్
భూజనాళి యెట్లుపోవ భోజనంబు దక్కినన్
రాజగౌరవంబునొంది రమ్యమైనజీవన
భ్రాజమానులైన చాలు పదవులన్ వరింపగా! 14

మ. కులమేదైనను నైకమత్యమది చేకూరంగ మేలౌను; మా
కులమే గొప్పది యన్న భావమది సంకోచింపగా జేయు న
న్యుల సైరింపని వేరుభావమదియున్ యుక్తంబుగా బోదు;యీ
కులతత్వంబునకన్న జాతియొకటన్ గుర్తింపు సేమంబగున్. 15

చం. కులముల పేర వేరుపడి కొట్టుకు చచ్చుట మేలు గాదు; మా
కులమొక రాజపక్షమున కూరిమి నిల్చునటన్న రీతియున్
బలిమియు కాదు; యెవ్వరును వాంఛితమౌనటు వోటుసేయగా
దలపవలెన్; కులమ్మది ప్రధానముగా దిది చేటు మార్గమౌ! 16

శా . పోటీ చేసెడివారి లక్షణములున్ పూర్వాపరఖ్యాతినిన్
వీటన్ గల్గిన మంచిపేరు మొదలౌ వృత్తాంతముల్ గాక మా
పేటన్ మాకులబృంద మందరము నాపేక్షించు పక్షమ్ముకే
యోటున్ జేయుదుమంట యెంత తగవౌనో విజ్ఞులే యెంచెడిన్.
17

చం. “మనకులజుండునైనయెడ మంచితనంబును గల్గు”నంచు నా
తని యెడ మంచిభావమును దాల్తురు; వేరొకడైన చాడ్పునన్
“మనకు రుచింపబో” దనుచు మన్నన సేయరు; వర్గభేదమే
మనసుననున్న జాడ్యము; ప్రమాదము దీని భరించగల్గుటన్. 18

చం. పరిచయమైనవాని కులవర్గము బట్టి సమాదరించు వై
ఖరి మన గ్రామసీమలను గ్రాలుచునున్నది; యెంతకాలమున్
జరిగినగాని బుద్ధుల ప్రసన్నత కల్గక మార్పురాక ముం
దరికెటు పోవజాలుదురు? నవ్యపథంబు రుచింపజాలదో! 19

మ. మనవాడన్న కులాభిమాన మెసగున్ మర్యాద రంజిల్లు; త
క్కినవారన్న విరుద్ధభావమగుచున్ కించిద్విభేదించు; చిం
తనసేయన్ తగుమార్గమౌనె యిది? ప్రస్తావించగా వారు వీ
రను భేదమ్ము పరిత్యజించిమనలేరా? యేల యీజాడ్యమ్మొకో! 20

ఉ. పాలనలో కులంబరసి పన్నుగ మంత్రి పదంబులిచ్చి కూ
టాలను ప్రోత్సహించి జగడాలు రగుల్చుచు నప్పళించి మా
యేలికయందు మీకులమదెంతయు వన్నె రహించె నన్న భా
ష్యాలను పల్కు నాయకుల సంగతి యెన్నడు మారునోకదా! 21

ఉ. కాలము మారుచుండె; కులకట్టడి దాటి వివాహబంధముల్
గ్రాలుచునుండె; నియ్యది వికాసమునొంది రహింపగావలెన్
మేలగు యోచనావిధిని మించుచునుండిరి కుట్టికారు; భా
వాల నవీకరించుకొని వర్తిలుచుండుట మేలు గూర్చెడిన్! 22

చం. ఒక కులజన్ముడింకొకని నోర్చుట నేర్వవలెన్ క్రమమ్ముగా
సకలజగమ్ము నేకకుల సంజనితమ్మని నమ్మగావలెన్
ప్రకటితబుద్ధి బద్ధులయి బాధ్యతనైక్యతతో చరించుచున్
వికట కులాభిమానమును వీడవలెన్ జనులింకముందటన్. 23

ఉ. ఎక్కువ తక్కువల్ గొలిచి హెచ్చులు పోవుట మానుకోవలెన్
నిక్కుట నీల్గుటల్ మరచి నీతిగ నైక్యత సాగగావలెన్
పుక్కిటిపొల్లులన్ విడచి పోడిమితో జనులందరేకమై
చక్కగ సాగిపోవలెను సన్నుతమౌ నొకటే కులమ్ముగా! 24

3. నైతిక విలువలు

ఉత్సాహ.

నీతితో చరించువాని నిల్వనీరు భూమిపై
పాతకుండటంచు వాని పారద్రోలుచుందురే
ప్రీతియౌనబద్ధమన్న పిల్లగాంద్రనుంచియున్
బూతులే వరిష్ఠమౌ ప్రభావశీలమవ్వియే! 1

ఉత్సాహ.

నీతిపారమొప్పుజెప్పు నిందితుండు సత్యమున్
బూతటంచు చీల్చిచెండి బుగ్గిపాలొనర్చెడిన్
ప్రీతితో నసత్యమాడు రీతినే వరించు ని
ర్మాతలౌదు రెందరో దురాగతంబొనర్చుచున్. 2

ఉ. నాలుక కోయుగాక తన నైజము మాని నిజంబు నెవ్వడున్
లీలగనైన పల్కడు; చలింప డసత్యముపల్క; నెన్నడున్
తాలిమితో నసత్యమును తద్దయునల్లుచు పాపసంహతిన్
మేలని కూడబెట్టుకొని మించెదరెందరొ భీతి లేకయున్. 3

ఉ. త్రాగుట తప్పుకాదు; బహుదర్పవిశేషమటంచు పూని నిం
డా గళపూర్ణమౌనటు గడంగడ త్రాగుచు నిల్లు నొళ్ళు గు
ల్లై గొడవల్ సృజించినను లక్ష్యము వెట్టక నాశమౌచునే
భోగములొందుచున్నటుల పోలికనానుచు తూలుచుండెడిన్. 4

ఉ. ఆయువు సన్నగిల్లినను నాపదు త్రాగుట; పిచ్చిమాటలున్
కూయుచు నింటినే నరకకూటమి జేయుచు భార్య నొంచుచున్
హేయముగా చరించు గతి నింతయు గానక రోగయుక్తుడై
సాయము లేక శల్యమగుసంగతి నెందరు లేరు ధాత్రిపై! 5

చం. పురుషులతోడ సాటి విరిబోణులటంచును తప్పతాగి మై
మరచును చిందులాడు సురమానినులట్లుగ గెంతు యింతులున్
తరచుగ గానవత్తురు ప్రధానముగా తన భర్తనెన్నడో
విరతిని వీడి వేరొకని వ్రేలిని బట్టిన కాంతలిద్దరన్. 6

శా. పాతివ్రత్యము కొన్నిచోట్ల కరవై భర్తన్ త్యజింపన్ మరో
చేతిన్ గైకొని చెట్టపట్టలెసగన్ సిద్ధాత్ములౌ స్త్రీలు ప్ర
జ్ఞా తాత్పర్యనిభాననల్ నవయుగజ్ఞానార్చనాశీల సం
జ్ఞాతల్ నాగరకప్రభావమున సంసారాల కన్పించెడిన్. 7

శా. టీవీలందలి సన్నివేశముల కంటెన్ మేని మేకప్పులున్
భావోద్రేకపు చర్యలున్ సతులు సంభాషించు రీతుల్ మరో
త్రోవన్ నచ్చినవాని సన్నిహితమున్ దుర్మార్గపున్ చేష్టలున్
భావాదర్శములయ్యెనేడు ప్రజకింపై యాచరింపన్ తగన్. 8

మ. వ్యభిచారంబు గరిష్ఠమయ్యె; సుదతుల్ వాంఛాఫలంబొందగా
నభిమానంబు గణింపకుండ మదినూహారేఖలౌ కోర్కెలన్
సుభగంబౌనటు తీర్చుకోదలచు నీ సూక్ష్మాంశమందిష్ట స
న్నిభమే ముఖ్యము కాదనన్ దగదు మన్నింపన్ వలెన్ లోకులున్. 9

ఉ. భత్యమునీయలేని దొర పన్నులు పెంచుచు నాయకారమున్
భృత్యులనుండి గైకొనుచు పేదల పీచమణంచు పద్ధతుల్
నిత్యము హత్య సేయుగతి నిక్కము కాదొకొ! దేవరన్నచో
సత్యవిధానపాలనము సల్పవలెన్ ప్రజ సంస్తుతింపగన్. 10

శా. అన్యాయంబు ఘటిల్లినన్ ప్రభువుతోడై తీర్చునన్ భావనన్
ధన్యుం జేయునటంచు కోరునెడ సందర్భమ్ము శోధించి నీ
కన్యాయంబొనరంగలే దిపుడిదే న్యాయంబనన్ దీనుడే
వన్యంబున్ బడిపోవు? దేవుడిటు లాశ్వాసింప దిక్కౌనెటన్. 11

ఉ. ఆస్తులు కూడబెట్టుకొని హర్షవిశేషములందువారికిన్
మస్తుగ మేకు దింపి జనమాన్యములన్ని పునస్సమీక్షచే
శిస్తులు పెంచికట్టుచు రసీదులు పొందిన వారికింతటన్
ఆస్తులు దక్కునంచు ప్రభువాజ్ఞలనిచ్చిన ధర్మమెట్లగున్. 12

ఉ. ఏలినవారి భక్తులకు నేలినయంతయు వ్రాసి యిచ్చి గ
గ్గోలిడు దేశవాసులకు కూర్మి రవంత యొనర్పకున్నచో
మేలగునెట్లు? నెవ్వరు సమీక్షను సేయగలారు? దిక్కు నే
మూలన నుండు? నెవ్విధి విముక్తి లభించును యీప్రజాళికిన్! 13

చం. గనులు పరిశ్రమల్ గుడుల కానుకలున్ జలధిప్రదేశముల్
కనబడు నాయమార్గములు కానుకగా తనవారికిచ్చి జీ
వనమును సేయుడీ జను లభాగ్యతనన్న జనాళికేది ది
క్కని మదిలోన క్రుంగెడి ప్రకారము నెవ్వరు దిద్దునియ్యెడన్. 14

చం. విభజన జేసి నష్టములు వేనకు వేలుగ పంచి కర్మ సం
విభవములిట్టులున్నవని వేడుక జూచెడి రాజకీయులన్
ప్రభువులటంచు మ్రొక్కులిడి పాదములంటిన కీడు వీడునే
యభయమెవండొసంగును సహాయమునెవ్వడొనర్చునియ్యెడన్. 15

ఉ. నీవొకశుంఠవన్న మరినీవును శుంఠవటంచు నిర్వురున్
భావకవిత్వ లాహిరుల బద్ధవిరోధ కవిత్వమల్లినన్
జీవనమెట్లు యీప్రజకు చింతయు దీరెడి మార్గమేది? స
ద్భావనతోడ నాయకులు భద్రపథంబు లవెట్లు గూర్తురో! 16

చం. యువత కుపాధి జూపగల యుద్యమమొక్కటి బూని వారికిన్
భవితను జూపగావలయు బాధ్యత గల్గి ప్రభుత్వవర్గముల్
నవవిధసేవలిచ్చుచు జనాళియు సౌఖ్యమునొందునట్లుగా
సువిధమునైన పాలనము శోభ రహింప నొసంగగావలెన్. 17

శా. అన్యాయంబు ఘటిల్లుచో సభలలో నత్యంతవాగ్ధాటితో
విన్యాసంబుగ నెత్తిజూపవలయున్ వేవేల ఖండించి స
భ్యన్యాయంబుగ నడ్డుకోవలయు గానన్ పార్లమెంటున్ విశే
షన్యాయంబుగ వైరిపక్షబలమున్ శౌర్యమ్ము పెంపన్ వలెన్. 18

మ. ప్రజలున్ చేతనగల్గి యెన్నికలలో వైదగ్ధ్యమౌ నీతితో
సుజనత్వంబు గలారినెన్నుకొని సంక్షోభమ్ము వారించు స
భ్యజనాళిన్ సభలందునిల్పునెడలన్ న్యాయంబు నిల్చున్ సభా
విజయంబొంది దురాగతంబణచునెవ్వేళన్ ప్రజాపక్షమై! 19

ఉ. ఎన్నికలందు సభ్యగుణహీనత నోట్లును వేయు రీతియే
యన్ని దురాగతంబులకు నాది వినాశపు మూలమౌను; యె
న్నెన్ని కథావిశేషముల నింపుగ బల్కుట కాదు! విజ్ఞులై
యెన్నిక జేసినన్ విషమహేతువులన్ని యణంగి మేలగున్. 20

ఉ. చట్టవిశిష్ట తత్త్వమును చక్కగ నిల్పిన మేలు గాదె? రా
జెట్టు దలంచు నవ్విధిని జేసిన నాతని కోర్కె దీరు; నీ
కెట్టులభించు నీహితము! యిందు ప్రజాభిమతమ్ము నిల్పుచున్
గట్టిగ మాటలాడగల గౌరవసభ్యుడు మేలు జేసెడిన్. 21

ఉ. రాజు నిరంకుశత్వమున రాజిల నాతని నిల్వరించి వి
భ్రాజిలు పార్లమెంటు జనరక్ష యొనర్చును గాని మూర్ఖతన్
జేజెలొనర్చి యన్నిటికి జేయన దేశము బిచ్చమెత్తుచున్
తేజమడంగి హీనముగ దీనతనొందు నచేతనమ్ముగన్. 22

శా. సామర్థ్యంబును గల్గువాడు సభలో స్థానంబు చేపట్టుచో
సామాన్యుల్ బ్రతుకంగ జాలుదురు విశ్వాసంబునన్: గానిచో
సామర్థ్యంబును లేని ధూర్తగణముల్ స్వార్థంబు సాధించుచున్
సామాన్యప్రజనిట్లణంచు; జనులే తన్మూలమీ వృత్తికిన్. 23

ఉ. పాలకులిట్లు హేయ గతి పాలన సేయుచునుండ మూలమీ
పాలితులేగదా! జనులు పౌరవిధానమెరింగి వర్తిలన్
గోల రవంత యుండున? యకుంఠిత దీక్షను పాలకుల్ సదా
పాలన సేయగా గలరు; పాపమదంత జనాలదే గదా! 24

4.మాదకద్రవ్యాలు

మ. యువకుల్ దేశపురోభివృద్ధికి నవోద్దీప్తుల్ మహాశక్తియున్
జవసత్వంబులు గల్గువారు; భవితన్ సాధించు సైన్యంబు; వై
భవతేజంబులు బుద్ధిసంపదయు భావావేశ తత్వంబులన్
గవయన్ జేసి పరాకునొందె మదిరాక్రాంతంపు చిత్తంబునన్. 1

మ. యువకుల్ మత్తున జోగుచుండిరికదా యుత్తేజితాహీనులై
జవనాశ్వంబులు కల్లు త్రాగి మదినుత్సాహమ్ము చల్లారగా
భవితవ్యంబును గోలుపోయి గుట్కన్ ప్రాణంబుగానెంచి స
త్తువ గోల్పోవుచునుండె జాతికిది యెంతో క్షుద్రదారిద్ర్యమౌ! 2

ఉ. మత్తుపదార్థ వర్తకము మాన్యతనొందెను మూడు పూవులున్
గుత్తిగ నారు కాయలను కూరిమి సామెత చెప్పినట్లు గ
మ్మత్తుగ బానిసీంద్రగుచు మైమరపొందుచు నెల్లవేళలన్
చిత్తుగ ద్రావి తూలిపడి సిగ్గును లేక చరించుచుండెడిన్. 3

చం. చదువది యెంత గల్గినను సంపదమించి రహించుచుండినన్
పదునుగ నాల్కహోలు గొని వైభవమియ్యది యంచు పూటుగా
మదమున త్రాగు చందము ప్రమాదమె యైనను సాంఘికమ్ముగా
నిది ఘనతావిశేషమని హెచ్చున త్రాగుట ప్రాణహానియౌ! 4

చం. బుడతలు కూడ గుట్క కొని మోదమునొందుచునున్న యట్లుగా
నడచుచునుండె నేడు నధినాయకులున్ ధనమిచ్చి వీరలన్
గడపుచునుంట హీనమగు ఖర్మము; దేశభవిష్యమెవ్వరిన్
జడియగ జేయకుండినది సర్వవినాశనమౌచు నుండినన్. 5

ఉ. బాలురనుండి వృద్ధగణవర్గము నంతకు మాదకమ్ములే
మేలి రహస్యబంధువులు; మేనుల గూల్చుచునున్న నవ్వియే
తాలిమి గూర్చునంచు కొని తత్పరతన్ గ్రహియించువారలై
తూలుచు వేరులోకమున దోగుచు జీవనహాని గూలెడిన్. 6

శా. సచ్ఛీలమ్మును మేథయున్ గలిగి గంజా పీల్చు లక్ష్యమ్ముతో
తచ్ఛీలమ్మును గోలుపోయి వెతలున్ తాడింపగా చిక్కి శ
ల్యచ్ఛాయన్ తిరుగాడు బాధితులు చాలామంది దేశమ్మునం
దిచ్ఛాహీనతతో చరించు బ్రతుకుల్ హేయంబుగా కూలగన్ 7

శా. ఆరోగ్యంబుగనున్నవాడు ఘనతాహంకారమున్ బూని విం
దారన్ లిక్కరుబానిసై యొడలిచందంబెల్ల రోగిష్ఠిగా
మారన్ జీరలకండ్లతో నుఱుముచున్ మత్తిల్లి ఘూర్ణిల్లుచున్
ఘోరంబైన పరిస్థితిన్ దరియుచున్ కూలంగ సిద్ధంబగున్. 8

శా. సారా బానిసలైన కార్మికులు నుత్సాహమ్ముగా త్రాగి సం
సారాలన్ మసి జేయుచుండె ప్రభువుల్ సంతోషమేపారగా
సారా పాటల నార్జనమ్ము గనుచున్ సర్వాధికారమ్ము వి
స్తారమ్మౌనటులన్ గడించి ప్రభుతన్ శాసించుచుండెన్ గదా! 9

ఉ. లిక్కరు పాటదారులకు లెక్కకు రాని విశాలసంపదల్
చక్కగ పారుచుండ జలసాల నొనర్చుచు మందుబాబులన్
తుక్కొనరించుచుండిరి యథోచిత రీతిని రాజసాన కై
పెక్కిన శోభనమ్ముల నభీష్టత గుల్కుచు విఱ్ఱవీగుచున్. 10

శా. సర్వుల్ కోరుచునుండ వర్తకులు గంజాయిన్ కొకైన్ లమ్ముచున్
సర్వస్వమ్మును దోచుకొందు రయినన్ చట్టమ్ము మౌనమ్ముగా
నిర్వాకంబొనరింప దుర్బలులు దానిన్ జూపి చెర్లాడుచున్
నిర్వక్రంబుగ నిర్వహింతురిట దానిన్ లబ్ధిశోభిల్లగన్. 11

శా. సంపాదించినదంత త్రాగి సతులన్ సాధించి బాధించుచున్
కొంపల్ దుర్గతి పాలుజేసికొనుచున్ ఘూర్ణిల్లు వారెందరో
సంపూర్ణమ్ముగ మత్తు బానిసలుగా చచ్చేటి వారెందరో
నింపాదిన్ గమనింప జాతికిది వర్ణింపంగ శాపంబగున్. 12

శా. కల్లున్ ద్రాగిన బుద్ధిమాంద్యమగు నిక్కంబిద్ది నాశమ్మునై
యిల్లున్ గుల్లగ జేయుగాన విడుమా యీదుష్ట కృత్యంబు; నీ
యిల్లాలున్ సహియింపబోదు నిను! నిన్నింటన్ విరోధించి పొ
మ్మిల్లున్ వీడియటంచు త్రోయుదురు నీహింసన్ సైపలేకుండుటన్. 13

ఉ. మాదకద్రవ్యముల్ జనుల మారణకాండకు మార్గమంచు గాం
ధీ దయజేసి చెప్పెను; విధేయులమంచునె నేటిపాలకుల్
కాదనకుండ రాబడి వికాసము గోరి 'ప్రసాదు" సేవ స
మ్మోదకమంచు నెయ్యెడ నమోఘముగా నెలకొల్పిరిమ్ముగన్. 14

ఉ. ఏరులకన్న మిన్నగ రహించుచునున్నది చీపు లిక్కరిం
పారుచు దేశమందు పరిపాలకులే నడిపింప నంతటన్
బారులు తీరి మందు కొనుబాబులు దమ్ము గడించలేక ఛీ
త్కారముతోడ తిట్టుచు వికారముతో మరిత్రాగుచుండెడిన్. 15

మ. మదిరాసక్తులు దారిమళ్ళి తమ సేమంబారయన్ జేసి నె
మ్మదినుంటన్ జగమందు కష్టమగు; సంభావించుచున్ పల్కె గాం
ధి దయార్ద్రంబుగ కల్లు మానుడనుచున్ దీక్షన్ వహించెన్ ప్రజా
హృదయోల్లాసముగా'ప్రసాదు' వెలసెన్ హెచ్చైన్ దుకాణంబులున్.16

ఉ. మాదక ద్రవ్యముల్ గొనుట మాన్యవిశేషము లోకమందు; నా
మోదకరంబు సర్వులకు; పూనికతో వలదన్న రాబడిన్
కాదనగావలెన్; ప్రభుత కాసులు తగ్గిన పాలనంబు సం
వేదకరంబగున్ ప్రజ కభీప్సితమిచ్చుట వీలుగాదనున్. 17

ఉ. వాలుతలంబెరింగిన ప్రవాహము మాదిరి లోకులెల్ల మ
ద్యాలకు దాసులై విడువమందురు దీనిని; త్రాగరాదనన్
తాలిమినుండలేరు; జనతాహృదయమ్ము నెఱింగి పాలకుల్
మేలుగ మేమెయిత్తుమనిమించి ప్రసాదమునొంచుచుండెడిన్. 18

ఉ. వారుణవాహినీధనము వాసి గడించుటచే ప్రభుత్వముల్
దారుణమైనగాని జనదాహము దీర్చగ వాడవాడలన్
కూరిమితో దుకాణములు గూర్చుచు నందరికందుబాటులో
పేరిమి నొంచుచుండ నిరుపేదల గాచెడి దిక్కు లేదురా! 19

ఉ. మాదకద్రవ్యసంపదల మానుగ గోరు ప్రభుత్వవర్గముల్
పేదలు సంపదల్ గలుగు పెద్ద లటంచు వివక్ష లేక నెం
తో దయతోడ కోరిన మధుప్రసవమ్ము నొనర్చుచుండ నా
వేదనజెంది వద్దను వివేకము యెవ్వరికుండునియ్యెడన్. 20

చం. అనుభవమున్న నాయకుడహర్నిశలున్ శ్రమియించి పాలనన్
కనుగొని చక్క జేయగల కార్యవిచక్షణ గల్గియుండు; నె
వ్వని కదలింపకుండ జనవర్గములందరు మోదమందగా
తనపరిపాలనానుభవ తత్పరతన్ తగు మేలొనర్చెడిన్. 21

ఉ. మత్తుపదార్థమెద్దియును మాకు రుచించదు వద్దటంచు వి
ద్వత్తును జూపుచున్ ప్రజలు వాంఛితమున్ ప్రకటించినప్పుడే
మత్తుపదార్థవర్తకము మానబడున్; మరియొక్కమార్గ సం
పత్తి గడించునీప్రభుత మద్యనిషేధపు ప్రత్యయంబుగన్. 22

మ. ప్రజలున్మత్తతనుండుచో ప్రభుతకున్ లాభంబు; యెవ్వారలున్
ధ్వజమెత్తన్ యతనంబు సేయరు; ప్రజల్ ధైర్యంబుగా నిల్చుచో
నిజరూపంబుల పాలకుల్ తమ కథల్ నిస్తేజులై తెల్పి వై
రి జనుల్ తూలగ వైభవంబుసెడి యుద్రేకాన కూలుం గదా! 23

ఉ. మత్తున తూలుచున్ ప్రజలు మౌఢ్యతనుండిన మేలటంచు గ
మ్మత్తుగ నీ ప్రభుత్వములు మానుగ లోన దలంచి హెచ్చుగా
మత్తుపదార్థముల్ విపణిమార్గములందున నమ్మికొంచు ను
వ్వెత్తున సొమ్ముకూర్చుకొని యుద్ధతినుందురు;మాన్పరెయ్యెడన్. 24

5. తీవ్రవాదం

ఉ. చంపెద చచ్చెదన్ జనుల శాంతినిగూల్చి భయంబుతోడ జీ
వించుచు చావ జేసెద; నభీష్టము దీరగ నీ మతస్థులన్
దెంపుతనమ్ముతో నణచి దిక్కు రవంతయు లేని రీతి ను
త్కంపము గల్గజేతునను దాష్టికమేలనొ తీవ్రవాదికిన్ ! 1

ఉ. బాల్యమునుండియే విషపు భావనలన్ తలకెక్కజేసి సౌ
శీల్యతనుగ్గడించి వివశీకృతచిత్తము నేర్పరించి 'మా
తుల్యమతంబు లోకమున తోచద'టన్న వివక్ష గూర్చుచున్
లౌల్యమనస్కులై తనరు లక్ష్యముతోడ జిహాదునేర్పెడిన్. 2

మ. పగసాధింతుమటంచు పల్కెదరు; నింపాదిన్ విలోకింపగా
పగకున్ కారణమేమి? యెవ్వరు మిమున్ బాధించిరే? హేతువిం
తగ లేకున్నను కక్షతో దునుము నుత్సాహంబు మీకేల? విం
తగనుండెన్ భవదీయవైఖరి;యదార్థమ్మింతయున్ గానవో! 3

ఉ. చిక్కనిమేథ యుండియును శ్రీఘ్రుత మేలును బొందలేక యే
దిక్కును లేని మార్గమున తీంద్ర వహించి జనాల జంపి కై
పెక్కిన హింసకున్ గడగు నిట్టివిధానము మేలు గూర్చునే?
చక్కగ వృద్ధినొంది కొనసాగుట నీకు రుచింపబోదొకో! 4

ఉ. అన్యమతస్థులేల రిపులైరి వచింపుము! నీ వెవండవో
అన్యము పుణ్యమున్ దెలియనట్టి జనంబుల జంపనేలనో
వన్యమృగాల వేటయను భాతిని యంతట రెచ్చిపోయినన్
ధన్యుడవౌదువే ప్రజ నధర్మముగా నిటు సంహరించినన్. 5

ఉ. నీకు విరోధులౌనెడ గణించి వధించెదవేమొ! యెందు నిన్
తాకని వారలైన జనతన్ తగు హేతువులేక జంపు ను
ద్రేకమదేల? యెవ్విధిని తీరని ద్రోహము జేసె వీరు? యీ
లోకము నీదు సొత్తగునె? లుబ్ధతనంబును మానుకొమ్మురా! 6

ఉ. నీమతవర్గమైన గణియించి సహింతువు; లేకపోయినన్
తామసమొంది చంపెదవు; ధర్మవిలోకనమింతలేదు; వే
రే మతమైన దైవమొకరేయను సత్యమెరుంగలేక యిం
కా మతయుద్ధమంచు కలకాలము చచ్చుచు చంపుచుందువే? 7

చం. సహనము లేక చంపుకొను సత్వమునే గడియించుకొంచు దు
స్సహమగు పాపభారమును సైరణ జేయుచు నెత్తికెత్తి నీ
వహితము జేయుచుంటివిది యాదరణీయము కాదు; బుద్ధిగా
విహితము కూర్చగల్గునెడ వేరగు భావములుండబోవురా! 8

చం. వనరులవెన్ని గూర్చుకొని బద్ధవిరోధమడంచు బుద్ధితో
ఘనబలసంపదన్ గొనుచు కల్గిన సంపద ఖర్చు సేయుచున్
తినుటకు లేని దుస్స్థితిని తెచ్చుకొనన్ సుఖమేమి? లోకమం
తను దునుమాడి చచ్చెడివిధానము నీకు రుచించునేమొకో! 9

ఉ. లోకము నీదియౌనె? ధరలో బ్రతుకుల్ భవదీయచిత్తమే?
తేకువ నీదు సమ్మతిని తృప్తిగడింతురొ జీవులిద్ధరన్!
వాకొనరాని తుచ్చపు వివాదఫలంబులు చూడచూడ హిం
సాయుతమైన మార్గములు; సర్వవినాశమొనర్చునెయ్యెడన్. 10

శా. విశ్వమ్మందున నీమతస్థులు మహావేగమ్ముగా వ్యాప్తమై
విశ్వాసమ్మున ప్రీతిపాత్రులయి జీవింపన్ మదిన్ గోరుటల్
నశ్వంబౌ మతకాంక్షయౌ; నిదియె సమ్మానింప రానట్టి మూ
ఢాశ్వాసంబగు నీ ధరాతలము నిండన్ జేరి హేయంబగున్. 11

ఉ. ఆయుధసంపదన్ గొనగ నార్జితవిత్తము ఖర్చుజేసి జీ
వాయువు చెల్లిపోవునటు లందరి భాగ్యమడంచి వైచి మీ
రేయది కూర్చుకోగలరు యింత దరిద్రము కన్న! కూర్మితో
సాయమొనర్చుకొన్న కడు సంతసమై యభివృద్ధినొందెడిన్. 12

మ. మతరాజ్యంబులలో గడించు సుఖ సమ్మానంబు లేదింత; ప్ర
స్తుతమున్ జూచుచు తీవ్రవాదమునకై జోదుల్ విజృంభించి బా
ధ్యతతో పూనికనొందుచుండుటగనన్ ధన్యాభివాదాలు సం
స్తుతులర్పింతుము లోకసేమమునకై శోధించి యత్నించినన్. 13

ఉ. చంపగ చావగా మనుజజన్మము దాల్చితివేమొ నీవు? నీ
చంపు విధానమంచు మనసా తలపోయక నిందుకోసమే
గంపెడు యాయుధమ్ములను గైకొని జీవితలక్ష్యమంతటిన్
చంపుకొనన్ వివేకగుణసాంద్రత మాసెను దుష్టసంస్కృతిన్! 14

చం. సహవాసంబొనరింపలేక జనులన్ చంపంగ యత్నించుటే
యహితంబైన దురాగతంబు; మహి నన్యాయప్రకారంబు; దు
స్సహదౌర్జన్య విరూపకార్యము; ప్రజాసంహారమేరీతిగా
విహితంబౌ నవనీతలంబున వృథావేశంబు గాకింతటన్. 15

మత్తకోకిల

దేశమందున తీవ్రవాదము తిన్నగా పరిమార్చ నా
వేశపూరితమైన పద్ధతి భిన్నమైన ఫలంబిడున్
దేశదేశములందు ప్రాకిన తీవ్రవాద మడంపగా
నాశనంబుల గూర్చి తెల్పి వినాశమాపగ కోరెడిన్. 16

మత్తకోకిల

కేవలమ్మిటు బోధ జేసిన కీడుమాన్పగ సాధ్యమా
నీ వశంబిది కాకపోవును నెమ్మదిన్ నలుమూలలన్
జావ గార్చుచు మూఢతత్త్వము జాడనాప ఘటించినన్
భావమందున మార్పువచ్చు ప్రభావమిచ్చి ఫలించెడిన్. 17

మత్తకోకిల

సైనికంబుగ తీవ్రవాదుల సంగతిన్ గమనించుచున్
పూని వారలు నాయుధమ్ములు పొందు మార్గము నాపినన్
మానితమ్ముగ హీనబలురై మానుకొందురు యత్నముల్
దీనులై నడయాడు మార్గము దిక్కులేక యణంగెడిన్. 18

మత్తకోకిల

వారి కాయుధమిచ్చువారల వైభవంబును ద్రుంచినన్
వేరుమార్గము లేక వారలు వీడు తత్పథమంతటిన్
కోరుకున్న మహాయుధంబులు కూడి యందక పోవుచో
వైరులన్ తెగటార్చు మార్గము వారికించుక దూరమౌ! 19

మత్తకోకిల

వీరలివ్విధి మించి పోవుచు వృద్ధినొందగ కొందరున్
కోరి యాయుధసంపదన్ సమకూర్చి పెంచుట మూలమౌ
వారలిచ్చిన యాయుధమ్ములు వారిపైననె వాడగా
వారికిన్ తగు బుద్ధి కల్గె నవారితంబగు హానిచే! 20

మత్తకోకిల

నేడు వేరొకదేశమివ్విధి నేర్పుగా నొనరించుటన్
కీడు మూడుచునుండెనిప్పుడు ఖిన్నులై నడయాడకన్
తోడుగా మరి కొంతమందిని తోడ్పడంగ సరించినన్
వీడి యత్నము భంగమై జను వేరుమార్గము లేకయున్. 21

మత్తకోకిల

చిన్ననాడు మతాభిమానము చిత్తమందున నాటుచున్
దన్నుగా నడిపించు నీబడి దారి మూసిన చాలురా!
చిన్ననాటను నాటు బీజము చేష్టలన్ దునుమాడ సం
పన్నమై చెలరేగ బోవు యభద్రభావ పరంపరల్. 22

మత్తకోకిల

అల్పసంఖ్యగ నున్నవారికి హక్కులిచ్చిన పాపమీ
యల్పబుద్ధి విశేషమై జనులందరిన్ హతమార్చెడిన్
కల్పితంబగు భావనాబల గాథలన్ రచియించుచున్
నిల్పుకొందురు మూఢతత్వము నిత్యమై చెరలాడగన్. 23

మత్తకోకిల

విశ్వమానవలక్షణంబులు వీరికిన్ తలకెక్కినన్
శాశ్వతంబుగ వీరి మూఢత సన్నగిల్లును తీవ్రతల్
విశ్వమందున కానిపింపవు వీరి యోచన మార్చి మీ
రాశ్వసించిన మేలు కల్గెడి నంతటన్ గణియింపుడీ! 24

6. ధర్మహాని

ఉ. నీతికి నిల్చువాడు ధరణిన్ మహనీయుడు పుణ్యవంతుడై
ప్రీతినొసంగు సత్ఫలగరిష్ఠతనొంది ప్రశాంతచిత్తుడై
యాతతకీర్తివంతుడయి యభ్యుదయంబున సత్యలోక మం
దే తనివార నుండగల డింతయు నైతికవర్తనంబునన్. 1

చం. అదియొక రాజమార్గము; మహాత్ములు కాలిడు సత్పథమ్ము; నె
మ్మదికిని భద్రమిచ్చు ఋజుమార్గము; నైతికధర్మచింతనా
భ్యుదయము కూర్చునట్టి గుణపూర్ణవరిష్ఠము; నీతిమంతమై
పదిలముగా మనస్సును సుభద్రతగాచెడి ధర్మమార్గమౌ! 2

ఉ. నీతినిజాయతీలు వరణీయము లీజగమందు నేరికిన్
ప్రీతికరంబునౌ నయిన భేదపరంపరలోన జిక్కి దు
ర్నీతిని యాశ్రయించిన ననేకవిధంబుల కష్టనష్టముల్
భూతలమందువాటిలుచు పొల్పు నశింపగ జేయుచుండెడిన్. 3

ఉ. పాపపు చింతనల్ బ్రతుకు భగ్నము జేయుచు లోన జేరి సం
తాపము గల్గునట్లు పలు ధర్మవిరుద్ధములైన త్రోవలన్
జూపి చరించునట్లు మనసున్ కబళించి దురాశనింపి ధ
ర్మోపహతిన్ బొనర్చుమని యూహల నింపి చరింప జేసెడిన్. 4

ఉ. నైతికమార్గమున్ విడచి నచ్చిన త్రోవ చరించు వారికిన్
ప్రీతి రహింప కోర్కెలు ఫలించును; సౌఖ్యములున్ తమంత తా
మే తగినట్లు కూడుకొని మించిన తృప్తినొసంగు నింతయున్
నీతిని దప్పి వర్తిలు కనిష్ఠులకున్ సమకూరు లాభముల్. 5

ఉ. ఆడినమాట తప్పుటయు నన్యసతిన్ కబళించి కూడుటల్
పాడుపనుల్ బొనర్చి ధనవంతునిగా తులతూగుచుండుటల్
పేడియు రాజ్యమేలుట యభీప్సితసిద్ధికి యైనవారిపై
దాడి యొనర్చి కూల్చుట యుదాహరణమ్ములు నీతిలేమికిన్. 6

ఉ. సాంఘికనేరసంచయ విషణ్ణతకున్ నిలువెత్తు దోపిడీ
సంఘటనల్ ఘటిల్లుటకు శాకినిపూనిన హంతకాళి దు
స్సంఘటనల్ పొనర్చుటకు చాలని మానసికాత్మశక్తితో
సంఘటితమ్మునై చెలగు సత్యవిహీనత మూలమయ్యెడిన్. 7

ఉ. నీతిని వీడినన్ కడుపునిండును కాంతకు; కష్టజాలమున్
పాతరయౌను; సౌఖ్యమును భాగ్యము హెచ్చును; కోర్కెలన్నియున్
ప్రీతిగ సిద్ధమై యనుభవింపు మటంచును బారచాచి వి
ఖ్యాతిని కల్గజేయు విధియంతయు కోరిన రీతి మారెడిన్. 8

ఉ. ధర్మము కర్మమంచు పెడదారిని బోయిన కష్టమేయగున్
కర్మవిచారమున్ వదలి కాంక్షలుతీర చరించి యద్దియే
ధర్మగుణానుసారమని తత్వనిరూపణ సేయ జాలినన్
కర్మఫలంబు ధర్మ నుడికారము దాల్చి లభించునెయ్యెడన్. 9

ఉ. తిండియు బట్టయున్ గృహము దివ్యముగా లభియించు మార్గ మే
ముండెనొ దానినే యెరిగి పుణ్యఫలంబని యాచరించుటే
మెండగు ధర్మమౌ నదియె మేలొన గూర్చును; కాని నీతికై
దండిగ కష్టముల్ గొనుట ధర్మము కాదని లోకులెంచెడిన్. 10

ఉ. లౌకికభోగలాలసత లక్ష్యముగా చెలరేగు వేళ నీ
త్త్యైకవిధానమున్ గొనెడి తాత్త్వికులుర్విని నిల్చియుండిరే?
లోకులు వాంఛ దీర్తుమని లోలుపతన్ కనుగీటి రమ్మనన్
నా కిదివద్దు పొమ్మనెడి నాయకుడెవ్వడు లోకమందునన్. 11

మ. కలికాలంబున చేతకాని జనులే కల్లల్ సమీక్షించు; నీ
యిలలోకల్మషమంటనట్టి నరుడొక్కింతన్ ప్రకాశించునే?
పలువాక్యంబులు పల్కువారలును లాభంబెచ్చి కన్పించినన్
కలియున్ కల్మషమున్ పలాయనమగున్ కాంక్షల్ ప్రవర్తింపగా. 12

ఉ. పాలకులందు నీతి సగపాలును లేదని పల్కువారిలో
లీలగనైన నీతి లవలేశము కంటికి కానిపించునే?
యేలినవారి దోషముల నెన్నెడివారల లోపమెంచినన్
చాలదు లోకభాండమది సర్వము నీతి విహీనమౌటచే! 13

ఉ. లౌకికవాంఛలన్ దగిలి లాలసతో నిజధర్మమార్గమున్
పోకడబెట్టి యైహికప్రమోదమునొందగ కోరువారలీ
లోకమునందు సౌఖ్యరసలోలురునై తనియంగవచ్చు కా
నీ కడకేఫలంబు గడియింతురొ దాని గ్రహింపగావలెన్. 14

చం. త్రికరణశుద్ధిగా నయవిధిన్ గమనించి చరించువానికిన్
సకలజనంబులందు కలుషంబులు పూని పరీక్ష బెట్టి ముం
దుకు జననీక కష్టముల ద్రోచి పరాభవకీలలందు కు
త్తుకవరకున్ మునుంగునటు తూలిపడన్ వడిద్రోయునందరిన్. 15

ఉ. ధర్మము నాశ్రయించు గుణతత్త్వము పుణ్యఫలంబు; కాని స
ద్ధర్మము వర్జనీయమని ధారుణిలోన సుఖంబునొంద నీ
ధర్మపథంబె యడ్డమని దౌష్ట్యవిధానమునెంచుకొంచు దు
ష్కర్ములు లోదలంచెదరు సత్యము నచ్చదు వారియాత్మకున్. 16

చం. చదివినవారు సత్కథలసారమెరింగినవారు యోచనా
స్పదులగువారు గ్రంథము లపారముగా పఠియించువారు కో
విదులగువారు సత్యగుణవేత్తలు నైతికజీవనంపు సం
పదనెరుగన్ గలారలిది భాగ్యము జన్మకు సిద్ధయోగమౌ! 17

శా. ఈలోకంబిది శాశ్వతంబగునె! యిందేనీవు నిల్చుండెదో!
యాలోకించిన మూడునాళ్ళ మురిపెంబౌ నీదు జన్మంబు కా
నీ లక్ష్యమ్మునెరుంగలేక జగమే నిక్కంబటంచున్ సదా
కాలక్షేప విలాసకాంక్షలెసగన్ గమ్యంబు పోద్రోతువే? 18

ఉ. ధర్మపరుండు భీరువని ధార్మికుడన్నను పిచ్చివానిగా
మర్మమెరుంగలేనతడు మాన్యుడు గాడని యీసడించుచున్
దుర్మదమొంది వర్తిలెడి దుష్టులు బుద్ధి యణంగిపోవగా
ధర్మవిహీనులై సుజనతత్త్వమునిట్లు పరాభవించెడిన్. 19

ఉ. ఎన్నటికైన కాచునది హెచ్చగు ధర్మము; దానిముందు నీ
వెన్ని కిరాతకంబుల విధించిన నిష్ఫలమౌను; తత్ఫలం
బెన్నగ నీకు దక్కును; సహించిన ధర్మము శాశ్వతంబుగా
తిన్నని సత్యలోకమును తీర్పుగ జేర్చును విశ్వసింపరా! 20

చం. ఒకరిని జూచి యింకొకరు హోరున నీతిని పాతిపెట్టుచున్
సకలజగంబునన్ కలుషసంహతి నింపుచు రెచ్చిపోవుచున్
వికలము జేయుచుండిరిది వింత ప్రవృత్తి వినాశకారియై
ప్రకృతిని మట్టుపెట్టును నివారణ సేయకయున్న మానవా! 21

ఉ. లాభము కల్గుచున్నదని లౌల్యతతో నవినీతినూనినన్
శోభ యణంగి జీవితము శూన్యమగున్ కడతేర్చు ధర్మమే
వైభవజీవదాత్రి బలవంతముగా చెడుదారి బట్టినన్
ప్రాభవమంతగోల్పడి యభాగ్యుడవౌదువు యంతమందునన్.22

మ. అవినీతిన్ గమనింప వేశ్యయగు; సత్యంబౌ కులస్త్రీ; యథా
ప్రవరన్ వీరల యందచందముల సంభావించుటే గాక బు
ద్ధి విశేషంబులనెంచి కోరవలె కాంతింగూర్చు సాధ్వీమణిన్
జవరాలట్లుగ నాత్మలో నిలిపి విశ్రాంతస్థితిన్ బొందగన్. 23

ఉ. నీతియె పైకితెచ్చు; నవినీతియె క్రిందికి త్రోసివేయు; నీ
నీతి గ్రహింపకున్న మననేరము లోకమునందు; కావునన్
నీతివిశేషముల్ తెలిసి నిక్కముగా దినచర్యలందు దు
ర్నీతిని ద్రోసివైచి ఋజురీతి వరించిన మేలుకల్గెడిన్! 24

౭.మతవైషమ్యాలు

చం. మతమొక మత్తుమందనుట మాన్యము గాదు; తరింప జేయు స
మ్మతమిలలో నవశ్యము; సమాదరణీయము; కాని నాదియే
మతమగు నన్యమెద్దియు సమానము గాదను మూర్ఖభావమే
మతకలహమ్ములున్ చెలగు మార్గము జూపును దీని మానరా! 1

ఉ. గాఢమతాభిమానమొలుకన్ తగవౌ నిది యేకపక్షమై
మూఢత నింపి నా మతమె పుణ్యఫలంబొనగూర్చు నన్యమున్
రూఢిగ హీనధర్మమనురోపణ నూటికి నూరుపాళ్ళు దు
ర్మూఢవివేకహీనతర బుద్ధి వివక్రత యెంచి చూడగన్. 2

చం. మతములు తప్పుకావు! తన మార్గము మాత్రమె యొప్పటంచు దు
ర్మతి వచయించు మాటలు ప్రమాదకరమ్ములు; జాతినంతటిన్
పతనము జేయు దుర్భరప్రభావము జూపెడి హీనమార్గమౌ!
మతిగలవాడు దుర్బలసమాగమచేష్టల నెన్నబో డిలన్. 3

చం. తన మతమే ఘనమ్మనుచు దానిని లోకమునందు వ్యాప్తిచే
యను పెరవారలడ్డుకొని యుద్ధములన్ బొనరింతురందుచే
ధనజనసంపదల్ గుమిలి దారుణమారణకాండ సంభవిం
చును చరితమ్ము గాంచిన యశోవిభవంబదియెల్ల దోచెడిన్. 4

చం. ఇరువదియొక్కమారులు బలిష్ఠత జూపి జిహాదుపేర పో
రిరిగద యేమి లాభము వరించిరి? మూర్ఖమనోభిలాషచే
మరణము దప్ప సౌఖ్యమును మాన్యతనొందిరె లేశమాత్రమున్!
తరచినకొద్ది మూఢఫలదర్పము కాక యశంబు గూడెనే? 5

మ. మతవిశ్వాసము రెండు వర్గములుగా మత్తెక్కి పోరాడుచున్
గతితప్పెన్ ధరలోన; మామతమె విఖ్యాతంబటంచున్ ప్రజల్
ప్రతిచోటన్ తమ నమ్మకంబు నిలుపన్ భావించి యత్నించుచున్
మతమార్పుల్ బొనరింతురిట్టి విధమే మౌఢ్యంబునైచ్యంబగున్.6

చం. తన మతమంతటన్ నిలిపి ధన్యుడనంచు దలంచు నాతడే
ధనబలసంపదల్ కొసరి దైవబలమ్మును కూర్చుకొన్నటుల్
మనముననెంచి తృప్తిపడి మాన్యతగా తలపోయు నిద్ది మూ
ఢుని గతి యంచు నెంచడెవడున్ ఘనకార్యమటంచు చాటెడిన్.7

ఉ. పేదలకున్ ధనంబొసగి పెన్నిధులైనటుదోచి మాటునన్
చేదుకొనున్ మతమ్మునిడి; చెన్నెసలారగ చేరినంతనే
మోదము గల్గునట్లు ధనమున్ పలుసాధనముల్ విరాళముల్
వేదిక జేర్చి కూర్చి నిరుపేదల బానిసలట్లు మార్చెడిన్. 8

ఉత్సాహ
రాజకీయమందునన్ పరాజయమ్మునొందియున్
తేజమలరగా మతప్రదీప్త బోధజేయుచున్
భోజనాది దక్షిణల్ ప్రపూర్ణరీతి నిచ్చుచున్
పూజనీయులై విశిష్ట బోధకుల్ రహించెడిన్. 9

శా. చారిత్రాత్మకమైన దేవళములన్ సంపన్నకేంద్రమ్ములన్
భారీకుట్రలతోడ భంగపరచెన్ పైశాచికవృత్తితో
వారున్ హైందవులౌను పూర్వము మతంబుద్విగ్నులన్ జేయగా
వీరున్ వేరుమతానుయాయులగుచున్ వీరత్వమున్ జూపెడిన్. 10

శా. దేశద్రోహము నేరమౌను; మతముద్రేకమ్ము గల్పింప నా
వేశమ్మూనుచు తీవ్రవాదులగుచున్ విచ్ఛిత్తికిన్ బూని యీ
దేశస్థుల్ మతమార్పిడిన్ గొనెడి యుద్దేశ్యంబు సాధించి యా
క్రోశానన్ చెలరేగునన్యమతకారుల్ క్రోధసంబుద్ధులై! 11

మ. మతమార్పిళ్ళకు కేంద్రదేశమిదియే; మన్నించి తావిచ్చుటన్
ప్రతివాడున్ చనుదెంచి తన్మతము నీపై రుద్ది పోషించున
ట్లతిగా కన్పడు; వాని లక్ష్యమది; కోట్లాదిప్రజానీకపున్
మతమార్పిళ్ళను సేయుటే పనిగ సంభావించువాడియ్యెడన్. 12

మ. మతవైషమ్యములెచ్చరించి కడు దుర్మార్గమ్ముగా దేశ వి
స్తృతి భాగించుచు మూడుముక్కలుగ చీల్చన్ గల్గె; నీ ధోరణుల్
ప్రతిచోటన్ కలహాలు రేపుచు ప్రజాసంఘర్షణల్ పెంచుచున్
కృతకృత్యంబగుచుండె దేశమునకున్ కీడెల్ల వాటించుచున్. 13

సీ. మతకారణంబుగా మనదేశవిభజన
మనిచె నానాడు దుర్మదముతోడ
మతఘర్షణలతోడ మారణకాండయై
మనుగడ సందిగ్ధమనిరి జనులు
ఆనాటినుండియు పోరాటపటిమకై
ఆదాయమంతయు హారతియయె
ఏతీవ్రవాదియో యెదిరించుననుభీతి
భద్రత చెడగొట్టి నిద్ర మాన్పె
తే.గీ. జనులజీవితమందున శాంతిలేదు
రాజకీయుల బేరసారాలు కుదిరి
రక్షణంబున విద్రోహరాశి పెరిగి
మేడిపండుగ దేశమ్ము మెరియుచుండె! 14

ఉ. వందలయేండ్లనుండి మతవైరములియ్యెడ నిత్యమాయె; రా
బందులవోలె చీల్చిచెడబారగ జేసిన గాథలుండె! కా
మందులు పన్నురూపమున మౌఢ్యత చూపి యణంచు రీతులున్
డెందములన్ దహించును; గడించిన భాగ్యములింతమాత్రమే! 15

ఉ. ఆలయవైభవమ్ములవి యక్కసు పాలయి నేల గూలె; వి
ద్యాలయశోభమాపి బహుదర్పము జూపెడివారు హెచ్చె; క
య్యాలు నిరంతరమ్ము చెరలాడెడి జంతువులట్లు వృద్ధియై
తాలిమినొంచివైచె; చరితంబుననింతకు మించి యున్నదే? 16

చం. ఎవరిమతమ్ము వారిదని యెవ్వడు మున్ను దలంపలేదు; మీ
భవితయు భాగ్యమున్ ప్రభువు పాలిటనుండినవన్న సత్య సం
స్తవమగు వాస్తవమ్ము మతతత్త్వము నిమ్ముగ పెంచి వైచె; మీ
రెవరయినన్ మదీయమతమే తమదన్నది శాసనంబయెన్. 17

సీ. ఈదేశవాసి వేరేదేశమున్ గూర్చి
వినుతించుటయు గొప్ప వేడ్క యగును
యుద్ధాదిక్రీడలన్ బద్ధవైరమ్ముతో
పరుల గెల్పును గోరు బంధువగును
ఈజనుల్ శత్రువుల్ పూజితుల్ పరజనుల్
బద్ధవైరము గల్గు సిద్ధులగును
చంపి చావగ తాను సాధించుటకు పుట్టు
తీవ్రవాది యతండు దిట్ట యగును

తే.గీ. ఇట్టి భేదము గల్గిన పుట్టువగుచు
జన్మభూమిని ద్వేషించు సాధువగుచు
కలిసి యుండక తప్పని గడుసగుచును
కక్షతోడను వసియించు దక్షుడగును! 18

ఉ. కాలము మారుచుండినది; గౌరవభావము జన్మభూమిపై
లీలగ కల్గుచుండినది; లేశము నాదనుభావమిప్పుడే
గ్రాలుచునుండి వాస్తవము కన్ గొనుచుండిరి; తోటివారికిన్
మేలు ఘటించు వైఖరియు మెల్లగనే ర్పడుచుండె నెల్లెడన్! 19

ఉ. లోకము జూచి నేర్చుకొని లుబ్ధతనంబును మాని నల్వురిన్
చేకొని మైత్రిభావమున చిత్తములోపల నెయ్యమూని యిం
దేకముగా విలీనమయి యిందరిలోనను తానునొక్కడై
లౌకికభావమూని జనులన్ గని కూడుట హర్షణీయమౌ! 20

8. కుటుంబ సంబంధాలు

ఉ. అమ్మ కుటుంబబంధమున కాదిమకేంద్రము; తండ్రి దానికిన్
సమ్మదితాభిపోషణ ప్రసన్నతనిచ్చెడి జీవశక్తి; స
త్యమ్ముగ వీరి కూడిక సుధాబ్ధికళామయ చంద్రరేఖలై
యిమ్ముగ వెల్గు బిడ్డలగు; నిట్టి కుటుంబము సౌఖ్యహేతువౌ! 1

ఉ. తల్లియె దైవమౌనని సదా భజియింతురు; దారి జూపు వి
ద్యుల్లత తండ్రియౌనతని తోడుగ బిడ్డలు పెద్దవారలై
సల్లలితానురాగ పరిషత్ప్రభవమ్ము కుటుంబమంచు శో
భిల్లుచు తల్లిదండ్రులును బిడ్డలనౌదల దాల్చి కుల్కెడిన్. 2

చం. కొడుకులు గౌరవాహ్వయులు; కూతులు వైభవదీపికాతతుల్
నుడువగ మన్మలున్ వరగుణోన్నతులై తమ తండ్రి తాతలన్
విడువక వారసత్వమున వేడుక సేయుచు నింటిపేరు సం
దడి వడిసేయ నిల్పుచు ప్రధానులుగా ఘనకీర్తినందెడిన్. 3

ఉ. వన్నెయు వాసియున్ గలుగు వర్తనతోడ కుటుంబకీర్తికిన్
చిన్నెలు దిద్దు బిడ్డలు వచింపగ సంఘమునన్ కుటుంబమే
మన్నననొంది నీతికి ప్రమాణముగా చెలువొంది నిల్చి రా
నున్నతరాలలో విలువనొంది మహోన్నతకీర్తి గాంచెడిన్. 4

ఉ. జీవితముండునంతకు సజీవమహోన్నత దైవమూర్తులీ
పావనమాతృమూర్తి పితృపాదులు; బిడ్డల గాచుకొంచు ర
క్షావనదీక్షతో మనిచి సర్వగుణప్రభలన్ మలంచి శి
క్షావిభవంబెలర్ప తగు సత్పథగాముల జేసి తీర్చెడిన్. 5

ఉ. వీరి ఋణంబు యెన్నటికి తీరదు; వీరు ధరాధిదైవముల్;
భూరిధనప్రపూర్ణులయి పుట్టుకనిచ్చిరి; వీరు లేనిచో
నేరికినైన జన్మమది యెక్కడిదీభువి? నందుచేతనే
వీరిని తూలనాడక విభేదములెన్నక నర్చసేయుడీ! 6

ఉ. కాలము మారుచుండె కలికాలప్రభావము చేత కన్నవా
రే లయకారులన్న నతిరేకవిరోధము హెచ్చి భార్యయే
మేలగు భాగమంచు కడు మిన్నగ నెంచుచు కన్నవారలన్
ద్రోలి గృహంబు పోనడచు తుచ్ఛులు బిడ్డలు గానిపించెడిన్. 7

చం. కొడుకుల పెండ్లియైన తరి కోడలు వచ్చును; తల్లి యత్తయై
నడుపును కోరటింకమది; నచ్చని కోడలు రెచ్చిపోయినన్
జడియు; కుమారుడామెపయి శౌర్యము జూపెడి; తల్లి మధ్యలో
గడబిడ సైచలేక విడికాపురముండును వేరు చోటులన్. 8

చం. కొడుకుల తీరులెట్లయిన కూతులపైననె తల్లి ప్రేమ యే
ర్పడి తన కూతురంచు ననురాగముతో తలపై ధరించుచున్
కొడుకును కోడలిన్ తనకు కూడని వారుగ లోదలంచుచున్
విడువగ నా కుటుంబమున వేరగు భావము లుప్పతిల్లెడిన్. 9

చం. ఉవిదకు నెన్నడైన కడునుత్తమురాలు వరాలతల్లియే
భవితనొసంగు భర్త యటువంటి మహత్వమునొందలేడు; యిం
దవగుణమేమి యన్న తన యత్తయు కోడలికింత దూరమౌ;
నవతలికేగు కూతురన నాత్మజగా నభిమాన మొందెడిన్. 10

చం. కొడుకునకున్ సతీమణియె కూరిమితోడగు; తల్లియన్నచో
నెడముగ దోచు; తండ్రిని గణింపడు; వీరన చిన్నచూపు; యి
య్యెడ తన బిడ్డలున్ సతియు నిష్టతతో తననే వరింపగా
కొడుకును తల్లిదండ్రులను కొంచెము కొంచెము దూరముంచెడిన్. 11

ఉ. అత్తయు మామయున్ జడిసి యవ్వలనుందురు కోడలింటిలో
మొత్తము నామె తల్లియె యమోఘముగా తన కూతునింటిలో
పెత్తనమున్ వహించునొక భేదము లేక; పరాయి యిల్లుగా
నత్తలిదండ్రులున్ దలచి యావలికేగుదురంట నయ్యెడన్. 12

మ. గృహకల్లోలములన్ దలంచి కొడుకుల్ కీడెంచి సంసారమున్
వహియింపన్ తగుదారి లేక సతితో వాదాడగా లేక ని
మ్మహిలో దైవసమానులౌ జనకులన్ మౌనమ్ముగా ననా
థ హితమ్మౌ శరణాలయమ్మున నిడున్ దాక్షిణ్యమేపారగన్. 13

చం. గడసరి కోడలే యధికగర్వమునన్ తన యత్తమామలన్
చెడుగులుగా దలంచి నిలు జేరగ వద్దని 'వృద్ధశాల' లో
పడి బ్రతుకుండనన్ మరొక బాటను గానగలేక కుందుచున్
గడుపుచునుండు జీవనము; కాంతురె వీరలనెవ్వరిద్ధరన్. 14

చం. ఎవరిది దోషమంచు మనమెవ్వరినిన్ గణియింపలే మిటన్
వివరము జూచినన్ కొడుకు వే నుతియించు సతీలలామనే
భువనమునందు తల్లియును పొల్పగు దైవమటంచు మెచ్చు; సం
భవమగు వాదులాటలను భగ్నము సేయగలేడు నేర్పుతో! 15

శా. అత్తాకోడలి వాదులాటలిటులై యాశ్చర్యమున్ గూర్చు; చే
టిత్తావున్ గల సోదరుల్ నడుమ పాటించున్ విరోధమ్ము; వి
చ్ఛిత్తిన్ గోరు కుటుంబసభ్యులు వచింపన్ లేరు సత్యమ్ము; సం
పత్తిన్ గూర్చిన వాదమో మదమొ యేభావంబొ వేర్పర్చెడిన్. 16

ఉ. కొందరు రామలక్ష్మణులు కొందరు రావణకుంభకర్ణులున్
కొందరు ధర్మజాదులగు కొందరు కౌరవ వీరసోదరుల్
కొందరు నాగమాంబ లిక కొందరు శూర్పణఖల్ వచింపగా
నందరునందరే హితులు నాంతరశత్రులు వంచనాత్మకుల్. 17

ఉ. కోడలుపిల్ల యేదయిన గ్రుడ్డిగ జేసిన కూడదన్నచో
వీడుము నాగృహంబనుచు వెంటనె భర్తను రెచ్చగొట్టి పో
నాడగజేయు నింకను సహాయనిరాకరణంబు జేయుచున్
దాడికి సిద్ధమౌ నిది యధర్మము కూడదటన్న నేరమౌ! 18

ఉ. గూఢముగా విరోధములు గూర్చెడి కోడలు పిల్లలుండెడిన్
మూఢతతో చరించుచు ప్రమోదమునొందెడి యత్తలుండెడిన్
గాఢవిరోధమెన్నుచు నగాధము లోబడు నన్నలుండెడిన్
ప్రౌఢత చాటుమాటల సరాగములాడెడి బంధులుండెడిన్. 19

చం. కలహములే కుటుంబముల గాథల మూలము; కారణంబులన్
తలచిన లాభముండదు; యథావిధి పోరుట లక్షణంబు; వై
రులు ఘనమైత్రిగల్గెడి విరుద్ధప్రభావులు; లోకమందు నె
వ్వలనను గానిపించునిది వారల నైజము దీని దీర్తురే! 20

ఉ. లోకమునందు మంథరలు లుబ్ధులు శూర్పణఖాదు లెందరో
వాకొన మామలున్ శకుని వంటి ప్రబుద్ధులు కొంపదీయగా
తేకువతో విభీషణులు తిన్నగనాయువుపట్టు దెల్పి చీ
కాకుల నాగమాంబలు ప్రకాశిలుచుందురు లోకమంతటన్! 21

ఉ. ఆయతమైన భారతామహాకథనంబున వాసిగొన్న రా
మాయణగాథలందు నవమానకరంబు నధర్మకర్మ వాం
ఛా యుతమైన పాత్రలు విశాలప్రభావముతో యుగాలుగా
పాయక నిల్చి యుండినవి భాగ్యవిశేషప్రకల్పనా ఝరిన్. 22

చం. విదురుడు నీతిమంతుడగు భీష్ముడు కార్యవివేకదక్షుడౌ
సదయుడు కృష్ణమూర్తి గుణశాలి మహాత్ముడు ధర్మరాజు ద్రౌ
పదియును సూక్ష్మధర్మముల పారము జూచిన పండితోత్తముల్
కదిసి కుటుంబరక్షణను గాచుకొనందగి యున్నవారలే! 23

మ. ఇది బ్రహ్మాండపు సూక్ష్మరూపము పరబ్రహ్మేశ్వరుల్ విష్ణువున్
మది సంకల్పముచేత పాలనము సంక్షేమమ్ము రూపించి పూ
ర్ణ దయార్ద్రంబగు దృష్టి నాదుకొనుచున్ రంజిల్లు క్రీడానుభా
వ దశా సంఘటితమ్మొనర్తురు సదా వారే గదా రక్షకుల్. 24

౨. నిరుద్యోగ సమస్య

ఉ. తాను కుటుంబసభ్యులును ధైర్యముతో బ్రతుకంగ కారణం
బైన నుపాధినొందదగునట్టి పథంబొనగూర్చుకొంటకై
పూనికతోడనే చదువ బుద్ధిదలంచును; వర్తకాదులన్
దైనిక యార్జనంబున నుదారముగా గడియింప గల్గెడిన్. 1

శా. ఉద్యోగంబు సమస్తజీవులకు నత్యుత్సాహ సంపాదనా
సద్యోగంబగు; నందుమూలమున నశ్రాంతంబుగా నార్జనా
విద్యాధారమునొంది జీవనములన్ వేర్వేరు చందాల సం
పద్యోగంబు గడించి తృప్తి గొనగా మార్గంబిదే యెత్తరిన్. 2

చం. అవసరముల్ విశేషముగ నానుచునుండె ప్రజాళికంతకున్
యువతకు జీవనాపథము యొప్పి లభింప కుటుంబమంతకున్
భవిత లభించు; నందరును భాగ్యవిశేషమునొంది తృప్తిగా
భువనమునందు జీవనశుభోదయమొందు సుఖాస్పదంబుగా! 3

చం. తలచినవన్ని సాధ్యమగు దారి లభించిన దుఃఖముండునే
కొలువు లభించి తాను మది కోరిన భత్యము నొందగల్గినన్
వెలుగులు నిండి జీవితము వెన్నెల గాయుచునున్న యట్లుగా
సలలితరాగభంగిమల సాగు ప్రపంచము సౌఖ్యసంపదన్. 4

మ. అధికాదాయము గల్గువారికిలలో నత్యంతవైభోగమౌ
నిధినిక్షేపములట్లు భార్యయు సుతుల్ నిర్మాణసౌధంబు లు
ర్వి ధనక్షేత్రములున్ లభించు పశువుల్ వేవేలగున్; సంపదల్
విధియైనట్లుగ చేకురున్; కొరత భావింపంగ రాదింతయున్. 5

శా. ఉద్యోగంబొనగూడినన్ బ్రతుకు హృద్యోదాత్తమైవెల్గు; నా
సద్యోగంబు లభింపకున్న బ్రతుకే సారంబు గోల్పోయి జీ
వద్యూతంబున నోడినట్లు కడు నిర్భాగ్యంబుగా దోచుచున్
సద్యోపాయము గాంచలేక బ్రతుకున్ చాలించు వారెందరో! 6

ఉ. ఏపనియైన గాని తనకింత ధనంబిడినంత చాలు; కా
నీ పనిలేని జీవితము నెమ్మదినుండక చీకుచింతచే
తాపము గల్గజేయు ;పరితాపమునొందినవాడు దీనతన్
సైపగ జాలడేదియును; సత్కృతులన్ పొనరింపకుండెడిన్. 7

ఉ. ఊపిరి నిల్పుకో దగిన యుత్తమమార్గ ముపాధి; దానికై
తాపముతో విదేశముల దారి బడున్; ఫలితమ్ము లేనిచో
నేపనియైన చేయుటకు నింతయు జంకక సాహసించు; వి
ద్యాపరిపూర్తియౌ వెనుక దారి కనుంగొనకున్న దీనుడౌ! 8

ఉ. కోట్లజనాళి యిద్ధరణి కూడును గుడ్డను పొందు కోర్కె నే
పోట్లు సహింపనుందురు; యుపాధి లభించిన పొట్టకూటికై
వాట్ల దలంపరింతయు; నవారితకష్టము లీయుపాధితో
నెట్లెటులో తరింతురు; సహించుట నేర్తురు జీవనమ్ముకై! 9

మ. పనికిన్ బోయిన కూలివచ్చు నటనే పైసల్ గడింపన్ దగున్
పనియే లేదన పొట్టకూటికెటులౌ? పాట్లవ్వియున్ తప్పవే
పనిలో భేదము బట్టి వేతనము సంభావ్యంబగున్ హెచ్చు కుం
దను భేదమ్ములుగావు; యోగ్యతయె నిర్ధారించు జీతమ్ములన్.10

మ. ఒకడార్జింప భుజించునే వురన నెంతో కష్టమౌ; తిండికే
సకలమ్మైనను గుడ్డగోచి కొనగా సంసారమీదంగ లె
క్కకు రాదెంత లభించినన్ ధరలునాకాశంబునందుండె నిం
కొక ప్రక్కన్ జనసంఖ్యహెచ్చి కరువున్ ఘోషిల్లుచుండెన్ ధరన్. 11

ఉ. సంఘమునన్ విలాసముల సంగతి హెచ్చెను; వీటి కోసమై
సంఘటితమ్ముగా ధరలు శబ్దము సేయక మించుచుండె ను
ల్లంఘన చేయరాని తగులంబుల దీర్పగ సొమ్ము కోరు దు
స్సంఘటనల్ చెలంగుట విషాదము లోకమునం దశాంతిగన్.12

చం. చదువులు పూర్తియైనను ప్రశాంతత గూర్చునుపాధి లేమిచే
చదువు లసార్థకంబనుచు చాలని యార్జనతోడ కుందుచున్
రొద నొనరించువారల పురోగతి యింతయు లేకపోవుటన్
కదనతలంబుగా మదికి కానగ వచ్చును ఘర్షణార్భటిన్. 13

మ. అభిమానంబును వీడి యాశపడి విద్యాపూర్తి యైనంతనే
ప్రభువర్గంబులలో నుపాధిగొనగా పల్మారు యత్నించి వీ
ర భటావేశముతో చరించి తుది విశ్రాంతిన్ నిదానించు యు
ద్ధభటుల్ వోలె నుపాధి లేని యువకుల్ దైన్యత్వమున్ పొందెడిన్. 14

శా. సంపాదించెడి వీలులేని యువకుల్ సామర్థ్యముప్పొంగినన్
కొంపాగోడును లేని దీనగతిలో కూర్చుండి చింతిల్లుచున్
నింపాదిన్ భవితవ్యలీల గనుచున్ నిర్మోహులై కోర్కెలన్
చంపంగోరి యుసూరటంచు నిలచున్ సంతప్తదేహమ్మునన్. 15

చం. అధికముగా జనమ్ముగల యర్భకదేశమునందు నార్జనా
విధమునెరుంగలేని యువవీరకిశోరులు శూన్యదృక్కులై
విధి గమనించుకొంచు తమ వేదనలన్ వినువారు లేక పె
న్నిధియిక దైవమే యనుచు నీతిగ వాని జపించుచుందెడిన్. 16

చం. ప్రజలకుపాధికల్పన విరాజిల జేయ ప్రభుత్వమార్గముల్
రుజువుగ నందజేయునెడ రూఢిగ పెక్కు రుపాధి పొందుచున్
విజయపథాన పోయెదరు; వీరి సమస్యలు తీరినంతనే
నిజముగ సౌఖ్యమొందెదరు; నిత్యము శోభగణింతురందరున్. 17

మ. ప్రతియొక్కండునుపాధి నొందగ ప్రభుత్వమ్మే దిశన్ జూపి స
మ్మతితో వీరికి నూతమిచ్చి నిలువన్ మార్గమ్ము జూపించు ప
ద్ధతి పాటించిన జీవికన్ గనుచు లబ్ధంబైన సంపాదనన్
ధృతితోడన్ తను ఖర్చుజేసికొనుచున్ తృప్తిన్ గనున్ పేదలున్.18

మ. తను సొంతమ్ముగ జీవవృత్తి గొని మిత్రత్వంబుతో కొందరిన్
తనతో కూర్చుచు సూక్ష్మవర్తకవిధిన్ ధైర్యమ్ముగా జేయుచున్
ఘనసంపాదన కూడబెట్టు విధమున్ కర్తవ్యసేవాఫలం
బనగా లబ్ధిని కూర్చి మేలొనరజేయంగల్గు దేశంబునన్. 19

శా. పారిశ్రామికజీవనమ్ము ప్రజకున్ పాలించువర్గాలకున్
భూరిశ్రేయము గూర్చి దేశభవితన్ పొల్పొందగా జేయు; నె
వ్వా రుద్యోగము లేదటంచు విలపింపన్ రాదు; సొంతమ్ముగా
తీరౌ జీవనమార్గమున్ దెలిసి వర్తింపన్ సదా మేలగున్. 20

మ. వినియోగింపగ రాని వస్తువెదియున్ వీక్షింపగా లేదు; బు
ద్ధిని జోడించి పరిశ్రమల్ నిలిపినన్ దేశమ్ము బాగౌ; ప్రభు
త్వనిబద్ధుల్ తగు సాయమిచ్చి బలముత్పాదించి తోడౌనెడన్
పనిలభ్యంబగు వేలమందికి నిటన్ భాగ్యంబు చేకూర్చుచున్ 21

శా . వ్యాపారంబులు చిన్నగా మొదలగున్ వర్ధిల్లుచున్ తిన్నగా
యూపందున్ బహువిస్తృతిన్ గనుచునుద్యోగాలు కల్పించుచున్
దీపించున్ బహుళార్థసాధకముగా దీనిన్ ప్రభుత్వమ్మువా
రే పోషించెడి భాగమందుకొన భారీ లాభముల్ చేకూరున్ 22

ఉ. ఏపనినైన చేయుటకు నెవ్వడు సిద్ధమునైన దేశమం
దే పనిలేని భావమది యెన్నడునుండదు; కష్టమెంచకన్
రేపులు మాపులున్ కృషివరించెడి కార్మికవర్గమంతకున్
తీపిమిఠాయివోలె పరితృప్తినొసంగెడి జీత మందెడిన్. 23

మ. పనిలోనందరు పాలుగొన్నయెడ సంపాదించువా రందరై
ఘనతన్ బొందును; దేశమీవిజయసంక్రాంతిన్ ప్రజాయుద్యమ
ధ్వనిగా మెచ్చుచు సాయమిచ్చి ప్రజకున్ ధైర్యమ్ము చేకూర్చి యిం
పొనరింపన్ పనితత్వభావమెదుగున్ భూరిప్రభాశీలమై! 24

10. అధిక జనాభా

చం. వనరుల మించి దేశమునవర్ధిలుచుండె జనాభ వీరికిన్
దనరెడి సేవలిచ్చుట యథార్థముగా కడు భారమౌను; కూ
ర్మిని బలు తృప్తినీయగల మేలగు పాలన యెట్టివారికిన్
కనుగొనగా నసాధ్యమగు గావున పాక్షికసేవలందెడిన్ 1

ఉ. మంది యనంతమై పెరుగ మజ్జిగ పల్చన యైనయట్లుగా
నందరికిన్ విలాసము లఖండత లభ్యము గావు; వస్తువుల్
కుందిన నాణ్యతన్ గలిగి కొందరికే లభియించు; నైన కా
మందులు వస్తుసేవల క్రమంబును దోచిన గోల యయ్యెడిన్ 2

మ. మనకున్ గల్గిన వెన్కబాటుతనమేమౌనన్న నాధిక్యమౌ
జనసంఖ్యావివరమ్మె! యిందరికి వాసగ్రాససౌకర్యముల్
తనియంగా సమకూర్చుటెట్లు? కరువే తాడించి నాట్యమ్ము సే
యను దేశమ్మును గాచుటెట్లు? ప్రజ సౌఖ్యాలొంద పోరాడగన్ 3

ఉ. నిత్యమునెవ్వడో యొకడు నేరములెంచుచు నుద్యమించుచున్
భత్యము పెంచుడీ యనుచు బాధ్యత వీడి ముఠాలు గట్టుచున్
సత్యమెరుంగకుండ మనసా తన సొంత ఫలాభివృద్ధికై
యత్యధునాతనంబయిన యాగడముల్ బొనరించుచుండెడిన్ 4

ఉ. ఇందరిలోన భేదములవెన్నియొనుండె మతమ్ము ప్రాంతమున్
కొందరిలో కులమ్ములు నిగూఢతతో విభజించు భాషయున్
చిందరవందరౌ బ్రతుకు చేష్టల గూల్చెడి తీవ్రవాదమున్
గందరగోళముల్ సలిపి కాంక్షలనొత్తెడి రాజకీయముల్ 5

ఉ. రాముని రాజ్యపాలనము రాజిలెనందురు! నాడునిట్టి దో
షామయ వర్తనమ్ము కలుషమ్ముల నింపి సమాజమంతటన్
ప్రేమ దొలంచి భేదముల రీతిని పెంచి యానాదృతమ్ముగా
క్షామము గూర్చెనే? జనుల సంఖ్య మితమ్ముగనుండి తోడ్పడెన్. 6

శా. ఏదేశమ్మును జూడ వృద్ధిగొని మేమే రాజులన్నట్లుగా
వాదించున్ బహుమాన్యలై వెలుగుచున్ వర్ధిష్ణులై తోడ్పడం
గా దాతృత్వము జూపి కీర్తిగొను; వక్కాణింప తద్భాగ్యమే
లేదింతైనను భారతావనికి నుల్లేఖింప దారిద్ర్యమౌ! 7

శా. విద్యావంతులు క్లుప్తసంతతి గనున్; వెన్ బాటులోనుండు వా
రుద్యోగంబన పిల్లలన్ గనుటగా నూహింతురో యేమొ సం
పద్యోగంబుగ సంతునే గనుచు సంభావించు మూఢాత్ములై
హృద్యద్భాగ్యము వీరు దెత్తురని యూహించున్ మదిన్ ప్రీతితో.8

ఉ. హెచ్చుగ బిడ్డలున్నయెడ నెంతయు కూలి గడించవచ్చు పై
పెచ్చు గడించినంతను నభీష్టము దీరగ ద్రావ వచ్చునన్
పొచ్చెపు యోజనన్ గనుచు పోషణ జేయగ లేక లోకమే
పచ్చగ జూచి బ్రోవవలె వారినటంచును రెచ్చిపోయెడిన్. 9

ఉ. ముచ్చెమటల్ స్రవింపగ సమూహముగా జనులెందు జూచినన్
హెచ్చి సమస్యలున్ గలుగ నెయ్యెడ ద్రోచుచు త్రొక్కినంతనే
విచ్చెడునట్లుగా వెలయు వేలకు వేల జనుల్ కనుంగొనన్
బిచ్చమునెత్తుకోవలసి పేదగ పుట్టుచు నుండెనేమొకో 10

చం. వనరులు నున్నవారలకు పంచగ చాలవు; యింక పుట్టుచున్
తనకును పంచి యిమ్మన యథార్థముగా కరువెచ్చిపోయి చిం
తను కలిగించు; లోకులకు తప్పవు కష్టములెందు జూచినన్
జనులకు జీవనమ్ములు నసాధ్యములై దురపిల్ల జేసెడిన్. 11

ఉ. తిండికి కష్టమౌను; పరితృప్తిగ వస్తువులొందకుండెడిన్
మెండగుపాడి దూరమగు; మేలగునిండ్లు లభింపబోవు నో
రెండినగాని నీరు లభియింపదు; కోర్కెలు తీరకుండెడిన్
దండితనంబు వెల్తియగు; దర్పము లెయ్యెడ సాగకుండెడిన్ 12

ఉ. ఎందును వృద్ధి కల్గదు; మరెందును తృప్తి రహింపబోదు; మీ
రెందున జూడ బోయినను హెచ్చిన కష్టపరంపరాదులే
కుందెడునట్లు జేయును నిగూఢముగా తగువాడుకొంచు మే
లొందగ లేక ఖిన్నులయి యోటమి పాలగు నీ ప్రజాళియున్ 13

ఉ. పచ్చని పంటభూములు నివాసములై చను; బీడు భూములున్
హెచ్చు ఖరీదునొందెడిని; యిమ్మగ పీల్చెడి ప్రాణవాయువున్
చచ్చుదనంబుతో నణగు; సర్వజనుల్ కరవొంది చూపులన్
గ్రుచ్చుచు నాకలిన్ దెలుపు క్రూరతనంబున పోర సిద్ధమౌ! 14

ఉ. దొంగతనాలు దోపిడులు దుర్మదవాదములెల్ల హెచ్చుచున్
భంగమొనర్చు జీవనసుభద్ర విధిన్; పలు రాజకీయులున్
రంగులు మార్చుకొంచు బవరంబుల జేయుచు మోసకారులై
యెంగిళులైన లాగికొనియే తిన జూచును లేకి బుద్ధులన్ 15

ఉ. అందరకున్ భుజించుటకు నన్నము పానము కూర్చి పాలకుల్
వందనభాగ్యమొందవలె బంధుర రీతిని; కాని దేశమం
దిందరు విస్తృతంబగుచు హింసకు పాల్పడుచుండ వీరి కో
ర్కెందగినట్లు తృప్తినిడు రీతి యొసంగ నసాధ్యమేరికిన్! 16

ఉ. ఇందరి భోజనమ్మునకు నింతకునింతగ తిండి కావలెన్
విందుకు తగ్గ పంటల నభీష్టతదీర బలమ్ము గూర్చగా
మందులు జల్లి రైతులు ప్రమాదమునెంచక సాగుచేసి యిం
పొందు ఫలమ్ములొందుటది పూర్తి విషమ్మగు దేశమంతటన్ 17

ఉ. మందులు కూరు తిండితిని మారణహోమము నందుగూలి ర
మ్మందురు సేవ జేయగ సహాయమొనర్చెడి వైద్యబృందముల్
మందులనిత్తు రందునను మాదక ద్రవ్యములల్లజేరి యే
మందు ఫలింపనట్లు ననుమానితవృత్తిని గూల్చి వైచెడిన్ 18

ఉ. భోగములన్ వరించునెడ పూర్వపు రీతిగ నల్పమౌ జనా
భా గలదేశమై జనుల భాగ్యవిశేషము గోరి విశ్వమం
దేగతి నన్యదేశములు హెచ్చుగ వృద్ధిని బొందుచున్నవో
స్వాగతమిచ్చి యవ్విధిని వర్తిల జేసిన మేలు కల్గెడిన్ 19

చం. ప్రజల మనోగతంబులు శుభప్రదమై నెరవేర గోరినన్
ప్రజ మితసంఖ్యనుండవలె; భాగ్యమదే సమకూరు నప్పుడే
విజయము గల్గు నన్నిట విభేదములెవ్వియు లేక దేశమే
భుజబలసంపదన్ గనుచు పోడిమినొందును సంతసమ్మునన్ 20

చం. మితజనసంఖ్య గల్గునెడ మేలౌన గూరును హెచ్చు వృద్ధియై
నుతిగొని వాసికెక్కును; మనోరథసంపద కూర్మి చేకురున్
కృతయుగధర్మవర్తనము కేలు మొగిడ్చి ధరన్ రహించు శ్రీ
మతికి ప్రజాళి సంఖ్య బహుమానముగా తగుమూలమై చనున్.
21

శా. కామక్రోధ వికారమోహముల యుత్కర్షమ్ము రాబోదు; యే
గ్రామంబందున కాటకమ్ము కనగా కన్పించదేనాడు; వి
శ్రామంబొందును ఘర్షణమ్ములు ప్రజాసంఘమ్ములందున్ మహా
క్షేమంబౌ మితసంఖ్యతోడి జనులున్ చెన్నారయోజించినన్. 22

చం. కరువది యెంతమాత్రమును కన్పడకుండును దేశమందు; శం
కరుడు కృపామతిన్ జనుల కాంక్షలు దీర్పదలంచు; కొద్దియౌ
సురవరులట్లు దేశప్రజ శోభనమౌ; మితసంఖ్యనున్నచో
నిరతము భోగభాగ్యములు నిశ్చయమై రహియింప మించెడిన్. 23

మ. జనసంఖ్యాధికమైన దేశమణగున్; సంక్షేమమున్ బొందలే
క నశించున్; క్రమరీతికానక ప్రజల్ కల్లోలసంక్షోభమం
దున కొట్లాడుచు తీరమున్ గనక నెంతోచింతతో క్రుంగు; నీ
జనసంఖ్యన్ మితినుంచుకొన్నయెడలన్ సౌభాగ్యమౌ నెల్లెడన్.24

పద్యాభినందన

సీ. అవినీతి జాడ్యమ్ము నంతమ్ము సేయఁగ
కులతత్వ కుడ్యముల్ గూలఁద్రోయ
నైతిక విలువలన్ నయముగా నెలకొల్ప
మాదకద్రవ్యాల మంటఁ గల్ప
తీవ్రవాదపు మాయ తెరలనుఁ దొలఁగింప
ధర్మహాని నడఁచు దారిఁ జూప
విమతవైషమ్యాల వేగతుల్ వెడలింప
బాంధవ్యముల తీపి ఫలముఁ గొనఁగ

తే.గీ. ఘన నిరుద్యోగపు సమస్యలను వచించి
మనకు నధిక జనాభా సమస్యఁ దెలిపి
తగు బరిష్కార విధముఁ బద్యములలోన
రమ్య పద భావ భరితమై రాణకెక్కఁ
జెప్పి యందఱన్ మెప్పింపఁ జేసె ఘనుఁడు
కవివరుఁడు మురళీకృష్ణ కమ్రరీతి.

'సమస్యా పృచ్ఛక చక్రవర్తి'
కంది శంకరయ్య
వరంగల్

'భావతరంగిణి' సాంస్కృతిక మాసపత్రిక వారు ప్రతిభా పురస్కారంతో
డా. చింతలపాటి వారిని సత్కరిస్తున్న దృశ్యం

కవి పరిచయం

డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ సుప్రసిద్ధ పద్యకవి. ఇప్పటికి మూడువేలకు పైగా పద్యాలను వ్రాసి యున్నారు. 20 రచనలను చేశారు. శ్రీ లక్ష్మణ యతీంద్రుల రచనలపై పరిశోధనావ్యాసానికి Ph.D. పట్టా పొందారు. వచనకవితలు, కథారచనలు, పత్రికా రచనలు, వార్తావ్యాఖ్యలు, రేడియో కార్యక్రమాలు, ఎన్నెన్నో చేశారు. తెలుగు కావ్యాల గురించి, భాషావిశేషాల గురించి, భారత, భాగవత, రామాయణాలపై 300 పైగా వీడియోలను యూట్యూబులో ఉంచారు. తెలుగు పంచకావ్యాల గురించి ఆస్ట్రేలియా నుంచి నెలల తరబడి ఉపన్యాసాలు చేశారు. వీరి **'తెలుగు తేజం'** ఖండకావ్యం మండలి ఫౌండేషన్ వారి అవార్డును గెలుచుకొంది. సహజకవితాకళాభిజ్ఞ, కావ్యకళాప్రపూర్ణ బిరుదులను పొందారు. వాస్తు జ్యోతిష పండితులుగా ఏభైయేళ్ళ నుండి సేవలను అందిస్తున్నారు.

వీరి శ్రీమతి బాలకృష్ణ కుమారి తెలుగు భాషా సాహిత్యాలలో M.A. చేసి 40 సం.ల పాటు గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా పనిచేశారు. రచనలలో మురళీకృష్ణ గారికి సహకరిస్తుంటారు.